MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 21 సంచిక: 11 రంగారెడ్డి జులై 2023 పేజీలు : 36 వెల : రూ. 10/-

## రూపుదిద్దుకుంటున్న నవభారతం !




ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ, మిలిండా గేట్స్ ఫౌండేషన్ వరల్డ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో శ్రీ సి ఎస్ రెడ్డి

## ఏపిమాస్ కు 22 వ వార్షికోత్సవ శుభాకాంక్షలు !



నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ ఎఫ్ ఎస్ డి డి బృందం సమావేశంలో సి జి ఎం శ్రీ ఆర్ గోపాల్‌తో శ్రీ సి ఎస్ రెడ్డి, శ్రీ మధుమూర్తి



## ఆంధ్రప్రదేశ్‌కు 4 జాతీయ అవార్డులు !



ఉపరాష్ట్రపతి నుంచి ఉత్తమ ఎస్ జి ఓ అవార్డు స్వీకరిస్తున్న శ్రీ మల్లారెడ్డి



తెలంగాణా దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జమ్మికుంటలో సర్టిఫికెట్లు అందుకున్న మెప్మా రిసోర్స్ పర్సన్స్

NABARD నాబార్డ్ సౌజన్యంతో ....


**మీకు తెలుసా ?**

గత 46 ఏళ్ళల్లో (1970-2016 ) ..

- ఉష్ణోగ్రత 0.48 డిగ్రీలు పెరిగింది
  - ❖ దీనివల్ల పంట దిగుబడులు 3%-10% వరకు తగ్గాయి.
- వానాకాలంలో పడే వాన 26 మి.మీ.లు తగ్గింది
  - ❖ 0.1 మి.మీ. వాన తగ్గితే, దిగుబడులు 0.2% -0.3% వరకు తగ్గుతాయి
  - ❖ మొత్తంగా పంట దిగుబడులు 13%-18% వరకు తగ్గాయి.
- వ్యవసాయ ఆదాయం సగటున 15%-25% తగ్గింది

## వాతావరణం మారుతోంది...

ఏటేటా పెరుగుతున్న ఎండలు



వద్దనుకుంటే వానలు...



జీవం కోల్పోతున్న భూములు....



పెరుగుతున్న పంటకు పురుగులు, తెగుళ్ళు ...



## బతుకు భద్రత తగ్గుతోంది...



వాన కోసం ఎదురుచూపులు...



అనుకోని వరదలు ...



మొలకకు అందని నీళ్ళు



చేతికి అందని పంటలు

రానున్న 30 ఏళ్ళల్లో (2020-2050) ...

ఉష్ణోగ్రత 1%- 1.4% పెరుగుతుందని అంచనా ...     ఒక్కసారి పరిస్థితి ఊహించండి!!

# మనకున్నది ఇప్పుడు ఒకే మార్గం...

# వాతావరణ మార్పులను తట్టుకునేలా సంసిద్ధం కావడం

NABARD

# మహిళా సాధికారత

సంపుటి 21 సంచిక 11



సంపాదకీయం

## పునరంకితం!

ఏపిమాస్‌కు 22 ఏళ్ళు నిండాయి. 23 వ ఏట ప్రవేశించింది. ఒక సంస్థగా, అదీ ప్రభుత్వేతర అభివృద్ధిరంగ సంస్థగా రెండుదశాబ్దాలకు పైగా నిలవడం, నిలదొక్కుకోవడం, మున్ముందుకు సాగడం, స్వీయ ముద్ర వేయగలగడం సాధారణమైన విషయం కాదు. అది మనసును మురిపించే ముచ్చట, తలెత్తుకుని ఒకింత గర్వించే మధురఘట్టం. అయితే, కేవలం కాలం గడపుతూ కొనసాగడమే ఈ అంకెల పెరుగుదల పరమార్ధమైతే అందులో ఆనందించడానికి కాని , గర్వించడానికి కాని ఏమీ వుండదు. నిజానికి అది ఆశించకూడని, ఆమోదించతగని ఒక కళంకం, ఒక దుర్దశ! ఉత్తమాభిరుచి కలిగిన వ్యక్తి కాని, వ్యవస్థ కాని చేయవలసింది ఆరోగ్యకరమైన పంథాలో తాను ఎదగడం, తన చుట్టూవున్న వ్యక్తులు, సమాజం అభివృద్ధిచెందడానికి తనవంతు తోడ్పాటు అందించడం. ఈ దృష్టికోణంలో చూసినపుడు గత 22 ఏళ్ళుగా ఏపిమాస్ ప్రస్థానంలో ప్రతిక్షణం సమాజ హితం దిశగానే సాగింది. స్వయంసహాయ ఉద్యమానికి నాణ్యతను నేర్పి, సుస్థిరాభివృద్ధికి బాటలువేయడం, గ్రామీణ పేదలకు, మహిళలకు అదనపు జీవనోపాధులను పరిచయంచేయడం, సాగునీటి నిల్వపద్ధతులపై అవగాహన కలిగించి, రైతులకు పంట దిగుబడులు పెంచుకునే మార్గదర్శనంచేయడం, ఆదర్శ గ్రామాల నిర్మాణాన్ని ప్రోత్సహించడం, నాణ్యమైన తాగునీటి అవకాశాలను, చక్కని పారిశుధ్య పద్ధతులను తెలియజేసి, ఆ పద్ధతులు పాటించడానికి తోడ్పాటు అందించడం , కౌమార బాలికలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు పాటుపడడం, పాఠశాలల విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడం, వరదలవంటి ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో , కరోనా కల్లోల సమయంలో బాధితులకు అండగా నిలవడం ... యిలా ఏపిమాస్ చేపట్టిన ప్రతి కార్యక్రమం ప్రజాహితమైనదే, సమాజాభివృద్ధికి దోహదంచేసేదే కావడం గర్వకారణమైన విషయం. ఇందులో కొంత గతం, కొంత యింకా వర్తమానం. చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని, ప్రతి ప్రాజెక్టును ఏపిమాస్ ఎంతో నాణ్యంగా, నైపుణ్యంగా నిర్వహించి పేరు ప్రతిష్ఠలను మూటగట్టుకున్నప్పటికి, స్వయంసహాయ ఉద్యమ భాగస్వామ్యం వల్ల ఏపిమాస్‌కు లభించిన ఖ్యాతి అంతాయింత కాదు. స్వయంసహాయ ఉద్యమంలో నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలో అగ్రగామిగా, స్ఫూర్తిప్రదాతగా నిలిస్తే, ఆ ముందడుగుకు, ఆ స్ఫూర్తికి వెన్నుదన్నుగా నిలిచింది ఏపిమాస్. నిజానికి స్వయంసహాయ ఉద్యమానికి రాష్ట్రంలోనే కాదు, దేశంలోనే ఏపిమాస్ చిరునామాగా మారిందన్నది కాదనలేని నిజం! ఇక వర్తమానానికి, భవిష్యత్తుకు వస్తే ఏపిమాస్ ప్రధాన కార్యరంగం ఎఫ్ పి ఓలు. మిగతా ప్రాజెక్టుల్లో చాలావరకు ఏదో ఒక రకంగా ఎఫ్ పి ఓలతో ముడిపడినవే. నాడు స్వయంసహాయ ఉద్యమం ప్రపంచంలో పేదరిక నిర్మూలనకు ఒక మహత్తర సాధనంగా రూపొందితే, యిప్పుడు ఎఫ్ పి ఓల ప్రక్రియ వ్యవసాయ రంగంలో, రైతుల జీవితాలలో విప్లవాత్మకమైన సానుకూల మార్పులు తెచ్చే మహోద్యమంగా రూపుదిద్దుకుంటున్నది. ఆంధ్రప్రదేశ్ , తెలంగాణాలలో ఏపిమాస్ కూడా ఎఫ్ పి ఓ ల నిర్వహణలో కీలక పాత్ర వహిస్తున్నది. ఎఫ్ పి ఓలను నాణ్యంగా, నిత్య నూతనంగా, సుస్థిరాభివృద్ధి సాధించే వ్యవసాయ వ్యాపార సంస్థలుగా తీర్చిదిద్దడానికి అనునిత్యం కృషిచేస్తున్నది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఎఫ్ పి ఓల ఎదుగుదలకు సహకారం అందిస్తుండడం శుభ పరిణామం. ఈ సానుకూల నేపథ్యాన్ని అందిపుచ్చుకుని ఎఫ్ పి ఓల సమగ్రాభివృద్ధికి ఏపిమాస్ సర్వవిధాల కృషిచేయాలని సంకల్పించుకున్నది. స్వయంసహాయ ఉద్యమం అనగానే ఏపిమాస్ పేరు గుర్తొచ్చే విధంగానే, ఎఫ్ పి ఓ అనే మాట వినిపించగానే కూడా మనసులో ఏపిమాస్ మెదిలేలా ఎఫ్ పి ఓల ప్రగతి గమనంలో ఏపిమాస్ ఒక విడదీయలేని భాగస్వామిగా మారాలి. కేరాఫ్ అడ్రస్‌గా ఎదగాలి. ఈ వార్షికోత్సవ సందర్భంగా ఏపిమాస్ కుటుంబసభ్యులమందరం ఈ లక్ష్య సాధనకు పునరంకితమవుతున్నాం.

Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:T.Chandra Sekhar Reddy**

**అయోమయంగా పరుగు పెట్టడం కంటె ఆత్మ విశ్వాసంతో ఒక్కో అడుగు వేసినా ఎంతో మేలే**

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

## లోపలి పేజీలలో ....


- 22 వసంతాలు ... 22 విజయ శిఖరాలు! ...05
- సమీకృత వ్యవసాయంతో సుస్థిర ఆర్థికాభివృద్ధి ...08
- రాగంపేట మహిళా ఎఫ్‌పిఓ చే గ్రామదుకాణ్ ...10
- వస్త్రపు సంచుల తయారీకి నాబార్డ్ ప్రోత్సాహం ...11
- నల్లమాడ రైతు సమాఖ్య విజయగాధ ...12
- పరపతి సంఘాలు ఆదాయం పన్ను కట్టక్కర్లేదు! ...15
- పంటలు ముందేవేస్తే అకాలవర్షాల బెడద ఉండదు ...16
- 'సహకారం'లో చెలరేగుతున్న అవినీతి ! ...18
- వారసత్వ ఆస్తి కుమార్తెల జన్మహక్కు:హైకోర్టు ...20
- ఇంగువ సాగుచేస్తే రైతుల దశ తిరుగుతుంది ...21
- కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా పాక్స్‌లు ...22
- ఆంధ్రప్రదేశ్‌కు 4 జాతీయ జల అవార్డులు ! ...24
- మదనపల్లి రైతును ముంచుతున్న జాక్‌పాట్ ...25
- వానపాముల పెంపకంతో నెలకు అరలక్ష ! ...26
- శ్రీజ పాల ఉత్పత్తిదారులకు రూ. 9.48 కోట్లు ...27
- 30 ఏళ్లు దాటిన మహిళల్లో కిడ్నీ సమస్యలు ...28
- వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి ...29
- ఆర్బీకేల్లో 10 లక్షల టన్నుల ఎరువులు ...30
- మాడు తెగులునుంచి పొద్దుతిరుగుడు సస్యరక్షణ ...31
- రోజుకు రూ.95 పెట్టుబడి రూ.14లక్షల రాబడి ...32
- ఎన్నో వ్యాధులనుంచి కాపాడే ఎర్రబియ్యం! ...33
- మహిళలూ... ఈ ఆరు లక్షణాలతో జాగ్రత్త ! ...34


## 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org


కలను కళ్ళలో దాచుకుంటే కరిగి కన్నీరవుతుంది, గుండెలో పొదువుకుంటే నెరవేర్చుకునే ప్రేరణ ఇస్తుంది

# 22 వసంతాలు ... 22 విజయ శిఖరాలు!

– ప్రహల్లాద , వినాయక రెడ్డి

స్వయంసహాయ ఉద్యమానికి ప్రోత్సాహం అందించాలన్న లక్ష్యంతో 2021లో ఏర్పాటైన ఏపిమాస్ సంస్థ అంచెలంచెలుగా తన కార్యక్రమాలను , పరిధిని విస్తరించుకుంటూ ఇరవై రెండు వసంతాలు పూర్తి చేసుకొని, విజయపథంలో ఎప్పటికప్పుడు మరిన్ని ముందడుగులు వేస్తున్నది.

2030 నాటికి 10 లక్షల అట్టడుగు వర్గాలకు చెందిన మహిళల, రైతుల, స్థానిక, సామాజిక వర్గాల నేతృత్వంలో వారి ఆర్థికస్థితిలో మార్పుకు తోడ్పడే విభిన్న రకాల సేవలందిస్తూ, స్వయం సమృద్ధి , స్వావలంబనతో పనిచేసే సంస్థల కొరకు సానుకూల జీవనోపాధుల ఏర్పాటుకు వెలుగు నిచ్చే మార్గదర్శిగా ఏపిమాస్ మరింత శక్తిమంతం, బలోపేతం కావాలన్న ఆశయంతో ముమ్మర కృషి సాగిస్తున్నది.

తన ఆశయ సాధనలో ప్రతి సంవత్సరం కూడా ఒక నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఏపిమాస్ అందరి మన్నలను పొందుతున్నది. ఇరవై రెండవ వార్షికోత్సవం సందర్భంగా, ఈ ఇరవైరెండేళ్ళలో ఏపిమాస్ చేపట్టిన అతిముఖ్యమైన ఇరవై రెండు కార్యక్రమాలను పరిశీలిద్దాం.

1. నాబార్డు మాజీ అధ్యక్షులు డాక్టర్ పి.కోటయ్య అధ్యక్షతన శ్రీ సి.ఎస్.రెడ్డి వ్యవస్థాపక సి ఇ ఓగా ఏపిమాస్ సంస్థకు 2001 సంవత్సరం జులై 1వ తేదీన ప్రాణప్రతిష్ట జరిగింది ప్రధానంగా నాణ్యత మదింపు, నాణ్యత పెంపుదల, సామర్థ్యం పెంపుదల, పరిశోధన అనే నాలుగు రంగాలలో స్వయంసహాయ సంఘాలకు తోడ్పాటు అందించే తన కార్యక్రమాలను ప్రయోగాత్మకంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆదిలాబాదు, కడప, ప్రకాశం జిల్లాలలో ప్రారంభించింది.
2. క్షేత్ర స్థాయిలో జరిగే వివిధ రకాల కార్యక్రమాల ఫలితాలను నమోదు చేసి, యావత్ తెలుగు ప్రజలకు అందించాలన్న సదుద్దేశంతో ఏపిమాస్ "మహిళా సాధికారత" మాస పత్రికను 2002లో ప్రారంభించి ప్రతినెల క్రమంతప్పకుండా ఆ పత్రికను వెలువరిస్తున్నది.
3. రాష్ట్ర స్థాయిలో స్వయంసహాయ సంఘాలు, వాటి సమాఖ్యలను మదింపు చేయడంకోసం 'గ్రేడ్స్' అనే సాధనాన్ని రూపొందించి అమలు పరచింది.
4. స్వయం సహాయ సంఘాల, సమాఖ్యలపై జాతీయ స్థాయిలో ఒక కార్యశాలను మొదటిసారిగా 2003లో నిర్వహించింది. ఆంధ్రా బ్యాంక్ తరపున 'స్వయంసహాయ సంఘాలు – మైక్రో ఫైనాన్స్‌పై' అధ్యయనం, స్వయం సహాయ సంఘాల నాణ్యతపై ఎనిమిది జిల్లాలలో మూడు అధ్యయనాలను నిర్వహించింది.
5. ఆగాఖాన్ ఫౌండేషన్ తోడ్పాటుతో 2004లో జీవనోపాధుల కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి పేద కుటుంబాల అభ్యున్నతికి వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టింది. ఐదు జిల్లాలలోని 11 మండలాలలో ఆదర్శ మండల మహిళా సంఘాలను ఏర్పాటు చేయడానికి నివేదికను రూపొందించింది.
6. "ప్రభుత్వ – ప్రభుత్వేతర సంస్థల భాగస్వామ్యం" పై రాష్ట్రస్థాయి సమ్మేళనాన్ని నిర్వహించింది. ఈ కార్యశాలకు ముఖ్య అతిథిగా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి హాజరై ఆర్థికాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్రను కొనియాడారు.
7. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 23 జిల్లాలలోని స్వయం సహాయ సంఘాల, సమాఖ్యల ప్రతినిధులతో రాష్ట్ర స్థాయి "సంప్రదింపుల వేదిక" ను ఏర్పాటు చేసింది.
8. పట్టణ , గ్రామీణ ప్రాంతాలలో స్వయం సహాయ





బీహార్ , యు పి లలో ...

సంఘాలను ఏర్పాటు చేయడానికి మెప్మా , సెర్ప్ సంస్థలతో ఒప్పందం చేసుకొని, 2005లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని 14 వెలుగు క్లస్టర్‌లలో సామర్థ్యం పెంపుదల కార్యక్రమాలకు తోడ్పాటు అందించింది.

9. 2006లో ఏపిమాస్ కార్యక్రమాల ప్రగతిని జర్మనీకి చెందిన ప్రొఫెసర్ శ్రీ హాన్స్ డైటర్ సీబెల్ తో అధ్యయనం చేయించి, భారతదేశంలో స్వయం సహాయ ఉద్యమ బలోపేతానికి ఐదు సంవత్సరాల ప్రణాళికను రూపొందించి, 2006 – 2011 కాలానికి నూతన వ్యాపారాభివృద్ధి ప్రణాళికకు రూపకల్పన చేసి, ఏపిమాస్ విజన్‌ను (ఆశయాన్ని) “భారతదేశంలో స్వయం సహాయ ఉద్యమ సుస్థిరాభివృద్ధి”గా సవరించడం జరిగింది.

10. ఏపిమాస్ వ్యవస్థాపక సభ్యులు, గ్రామీణాభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు ఎంతగానో కృషిచేసిన ఐ.ఎ.ఎస్. అధికారి కీర్తిశేషులు స్మరజిత్ రే జ్ఞాపకార్థం స్మారకోపన్యాస కార్యక్రమానికి శ్రీకారంచుట్టి , ప్రతి సంవత్సరం ఆయన పుట్టినరోజున ఒక ముఖ్యమైన అంశంపై స్మారక కార్యక్రమాన్ని కొనసాగిస్తూ శ్రీ స్మరజిత్ రే సేవలను ఏపిమాస్ స్మరించుకుంటున్నది. రిజర్వ్ బ్యాంక్ అప్పటి గవర్నర్ శ్రీ వై.వేణుగోపాల్ రెడ్డి మొదటి స్మారకోపన్యాసం చేశారు.

11. భారతదేశ సమ్మిళిత అభివృద్ధిలో దేశవ్యాప్తంగా స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేయాలన్న సదుద్దేశంతో కలసి వచ్చే సంస్థలతో “జాతీయ స్థాయి వేదికను” ఏర్పాటు చేసి ఆ కార్యక్రమాల సమన్వయ బాధ్యతను ఏపిమాస్ చేపట్టింది.


12. ఏపిమాస్ తన కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు విస్తరించింది. ఆగాఖాన్ ఫౌండేషన్ తోడ్పాటుతో మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలలోను, మిషన్‌శక్తి తోడ్పాటుతో ఒడిసా రాష్ట్రంలోను, టాటాట్రస్ట్ తోడ్పాటుతో ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలోను తన కార్యక్రమాలను విస్తరించింది.

13. ఏపిమాస్‌కు సొంత భవన నిర్మాణం కోసం ప్రణాళికా సంఘం 2009లో రూ. 5 కోట్లు మంజూరు చేసింది.

14. భూగర్భ జలాలను, భూమిని పునరుజ్జీవింపజేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదిలాబాదు, అనంతపురం జిల్లాలలో నాలుగు మెగా వాటర్‌షెడ్ పథకాలను తొలిసారిగా మంజూరుచేసి, వాటి ఆదర్శ నిర్వహణ ఆధారంగా మరో రెండు పథకాలను చిత్తూరు జిల్లాలో ఏపిమాస్‌కు కేటాయించడం జరిగింది. ఈ ఆరు మెగా వాటర్‌షెడ్ పథకాలను అధిక నాణ్యతతో విజయవంతంగా అమలు చేయడం జరిగింది.

15. జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ తోడ్పాటుతో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో జీవనోపాధులను మెరుగుపరుచుటకు, ఆ ప్రాజెక్టు సిబ్బందికి ఏపిమాస్ అనేక సామర్థ్యం పెంపుదల కార్యక్రమాలను అమలు పరిచింది.

16. గ్రామీణ ప్రాంతాలలో పచ్చదనాన్ని పెంచే లక్ష్యంతో, జర్మనీకి చెందిన బిఎఫ్‌టిడబ్ల్యు సంస్థ తోడ్పాటుతో సమీకృత వ్యవసాయ విధానాలను ప్రోత్సహించడానికి చిత్తూరు, అనంతరపురం జిల్లాలలో ‘జి4’ ప్రాజెక్టును అమలు జరిపింది



కరోనా కల్లోలంలో ఏపిమాద్ సహాయ చర్యలు

17. జర్మనీకి చెందిన జిఐజడ్ సంస్థ తోడ్పాటుతో 'హరిత వినూత్న కేంద్రాల పథకం' ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పేదలను, మహిళలను, యువ రైతులను చైతన్యపరిచి వారిద్వారా రైతు ఉత్పత్తిదారు సంఘాలను ఏర్పాటు చేసి 9000 కుటుంబాలకు ప్రత్యక్షంగాను 6000 కుటుంబాలకు పరోక్షంగా మేలుచేకూర్చే ఉద్దేశంతో ఎనిమిది మండలాలలో వివిధ రకాల విలువ గొలుసు కార్యక్రమాలను చేపడుతున్నది.

18. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టిన 'కరువు ఉపశమన పథకం' అమలుకు అనంతపురం జిల్లాలో ఏపిమాస్ 'లీడ్ సంస్థ'గా పనిచేసింది.

19. 'అరబిందో ఫార్మా' సంస్థ సహకారంతో పెయ్యలపాలెం, బోరబట్ల మొదలగు గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దే కృషిని, పీలేరు ప్రాంతంలో విద్యాలయాల సమగ్రాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించింది.

20. గ్రామీణ ప్రాంతాలలో ఆహారభద్రత సాధించే లక్ష్యంతో అన్నమయ్య జిల్లాలోని కురబలకోట , వాల్మీకిపురం మండలాలలో లక్సంబర్గ్ కు చెందిన ఏ ఇ ఐ ఎన్ సంస్థ తోడ్పాటుతో 'పాడిపంటలు' కార్యక్రమాన్ని అమలుచేస్తున్నది.

21. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఉద్యానశాఖ ప్రోత్సాహంతో చిన్న , సన్నకారు రైతులతో ' రైతు ఉత్పత్తిదారు సంస్థలను (ఎఫ్ పి ఓలను) ఏర్పాటుచేసి పంట ఖర్చు తగ్గించి, వారి ఆదాయాలను పెంచే వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్నది.

22. ఎఫ్ పి ఓల సభ్యులు తమంత తాముగా ఎఫ్ పి ఓల గురించిన అవగాహన పెంచుకుని, తమ సంస్థలను బలోపేతం చేసుకుంటూ, తమ జీవనోపాధులను మెరుగుపరుచుకొని ఆదాయాలను పెంచుకోవడానికి వీలుగా పది అంశాలతో "స్వయం అభ్యసన" శిక్షణ కరదీపికలను ఏపిమాస్ రూపొందించింది. దేశంలోని చాలా ప్రాంతాలవారికి ఉపయోగపడేలా ఈ కరదీపికలను తెలుగు భాషతో పాటు ఆంగ్లం, హిందీ భాషలలో కూడా తీసుకు వచ్చింది.

పైన తెలిపినవి కేవలం కొన్ని ముఖ్యమైనవి మాత్రమే. సన్నకారు, చిన్న రైతుల అభ్యున్నతికి అనేక రకాల కార్యక్రమాలను అమలుపరచడంతోపాటు, సురక్షిత మంచి నీరు, పారిశుద్ధ్యం, ఆరోగ్యం మొదలగు అంశాలలో పేద కుటుంబాల వారిని చైతన్యపరచి, వారు వాటి ఫలితాలను పొందడానికి మహిళా సంఘాలతో కలసి ఆర్థిక సహాయం కూడా అందజేస్తున్నది.

ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీ సి.ఎస్.రెడ్డి గారి సమర్థమైన మార్గదర్శకత్వంలో ఎంతో మహోన్నతమైన ఆశయంతో పేద రైతులు, మహిళలు, పేద కుటుంబాలవారు సంఘటిత స్వయంశక్తితో తమ అవసరాలను తీర్చుకునే విధంగా వారి అవగాహనను పెంపొందించే అనేక కార్యక్రమాలను రూపొందించి అమలుచేస్తూ , మరిన్ని ప్రాంతాలకు, మరింతమంది ప్రజలకు చేరువఅవుతున్న ఏపిమాస్ సంస్థ, ఆ సంస్థ విశిష్ట నిర్వహణకు మార్గదర్శకత్వం వహిస్తున్న పాలకవర్గం, అంకితభావంతో అమలుజరుపుతున్న సిబ్బంది ఎంతైనా అభినందనీయులు.

■

# సమీకృత వ్యవసాయంతో సుస్థిర ఆర్థికాభివృద్ధి

– బి. శ్రీను

సమీకృత వ్యవసాయాన్ని ఆచరించటం వలన పరిమిత విస్తీర్ణంలో పంటల సాంద్రత పెరిగి నిర్ణీత కాల వ్యవధిలో ఉత్పాదకత పెరిగి, నికర ఆదాయాన్ని పెంచుకోవచ్చు. పాలను, గుడన్లు, మాంసాన్ని, చేపలను, కూరగాయలను ఇంటి అవసరాలకు ఉపయోగించటం వలన కుటుంబ సభ్యులకు పౌష్టిక ఆహారాన్ని అందించవచ్చు. పశువులకు, కోళ్ళకు దాణాగా వాడుకోవటం వలన ఖర్చు తగ్గించడమే కాక పర్యావరణ కాలుష్యాన్ని కూడా నివారించవచ్చు.

**1. ప్రధాన పంటల సాగు :**

సమీకృత వ్యవసాయంతో పరిమిత విస్తీర్ణంలో పంటల సాంద్రత పెరిగి, నిర్ణీత కాలవ్యవధిలో ఉత్పాదకత పెరిగి, నికర ఆదాయాన్ని పెంచుకోవచ్చు. కావున రైతు సోదరులు పరిమిత భూమి ఉన్నప్పుడు సాగునీటి కొరకు బోరును కాని, నుయ్యినిగాని ఏర్పాటు చేసుకోవాలి. ఉన్న భూమి విస్తీర్ణంలో 60–70% పలు రకాల పంటల కొరకు కేటాయించాలి. మంచి మార్కెట్ రేట్లు లభ్యమయ్యే పంటలను ఎన్నుకొని వేసుకోవాలి. సంవత్సరానికి 365 రోజులు పొలంలో పంటలు ఉండేటట్లు పంటల సరళిని ప్రణాళిక చేసుకోవాలి.

**2. పశుసంపద :**

మన దేశ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పశుసంపదను మూడు రకాలుగా విభజించవచ్చు. అవి: వ్యవసాయానికి ఉపయోగపడే పశువులు, పాలు యిచ్చే పశువులు, పై రెండు రకాలుగా (పాలకు, వ్యవసాయ పనులకు) ఉపయోగపడే పశువులు. పశువుల ద్వారా వచ్చిన వ్యర్థాల (పేడ) ఆధారంగా వర్మి కంపోస్టును తయారు చేసుకోవచ్చు. ఈ వ్యర్థాలు సులభంగా పండ్ల తోటలకు, కూరగాయలు సాగుచేసే ప్రాంతాలకు చేరే విధంగా షెడ్‌ను నిర్మించు కోవాలి. క్షేత్రంలో సుమారు 3–9 సెంట్ల విస్తీర్ణంలో పశుగ్రాసాలను సాగు చేస్తే పశువుల మేతకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

**3. చిన్న జీవాల పోషణ :**

మేకలను, గొర్రెలను చిన్న చిన్న యూనిట్లుగా పెంచాలంటే అన్ని కాలాల్లో అన్ని వాతావరణ పరిస్థితుల్లో పంట, పశుగ్రాస వసతి ఉండాలి. వృక్ష సంబంధ రొట్ట, పంటల వ్యర్థాలు, నీటి సదుపాయం, విటమిన్లకోసం రైతులు చిన్నజీవాల పోషణను వ్యవసాయ అనుబంధ రంగంగా చేపట్టడం ఎంతో అవసరం. మన దేశ గొర్రెల్లో దక్షిణ భారతదేశ వాతావరణానికి అనుకూలమైన నెల్లూరు, దక్కన్, బళ్ళారి జాతులున్నాయి. మేకల్లో జము (వరి, ఛార్జర్, బీటల్) జాతులు చెప్పుకోదగ్గవి. జీవాల పెంపకం, మాంసోత్పత్తి ద్వారా అదనపు ఆదాయం పొందటమే గాక పాలఅమ్మకం, పాల ఉత్పత్తుల ద్వారా క్షేత్ర స్థాయిలో సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవచ్చు.

**4. కోళ్ళ పెంపకం :**

రైతులు వంటల సాగుకు అదనంగా, కోళ్ళ పెంపకాన్ని అనుబంధరంగంగా చేపట్టి, ఒక్కో యూనిట్‌లో సుమారు 25–30 కోళ్ళు వుండేలా చూసుకొని నివాస వసతి, నీటి సౌకర్యం కల్పిస్తే మంచి ఆదాయం లభిస్తుంది. కోళ్ళ పరిశ్రమలో 60–70 శాతం ఖర్చు దాణాకే అవుతుంది. కోళ్ళ పెంపకాన్ని వ్యవసాయంతో కలిపితే వ్యవసాయ ఉత్పత్తుల్లో సుమారు 40 శాతం దాణా ఖర్చును తగ్గించు కోవచ్చు. మొక్కజొన్న, వరిపొట్టు, నూనె చెక్కలు వ్యర్థాలను కోళ్ళ దాణాగా ఉపయోగించుకోవచ్చు. కోళ్ళలో రాజశ్రీ, కడకనాథ్ వంటివి క్షేత్ర స్థాయిలో పెంచితే సహజ వ్యర్థాలు, పురుగులు, ఆకులను తినటం వల్ల రైతుకు అదనపు ఆదాయం సమకూరి, ఈ ఆదాయం పెట్టుబడికి ఉపకరిస్తుంది.

**5. అజొల్ల సాగు :**

పాడి పరిశ్రమలో పశుదాణాకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అయితే పశుదాణాలో వాడే వేరుశనగ చెక్క, ప్రత్తి చెక్కలు ఖర్చుతో కూడుకున్నవి కావడం వల్ల పాల ఉత్పత్తి

నిన్ను గుడ్డిగా నమ్మేవారికి , వారి నమ్మకం గుడ్డిదని నిరూపించడం తెలివైన పనేనా ?

ఖర్చు ఎక్కువవుతుంది. ఈ పరిస్థితుల్లో వాటికి ప్రత్యామ్నాయం గా అజొల్లా వాడకంవల్ల రైతుకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుంది. పశువుల దాణాలో ప్రోటీన్లను అందించే వేరుశనగ చెక్క, ప్రత్తి చెక్కలకు ప్రత్యామ్నాయంగా 25% ప్రోటీన్లు గల అజొల్లా వాడడం ద్వారా దాణా ఖర్చు తగ్గించవచ్చు.

**6. తేనెటీగల పెంపకం :**

తేనెటీగల పెంపకం ఒక వ్యవసాయాధార పరిశ్రమ. తేనెటీగలకు కావాల్సిన పుప్పొడి, మకరందం క్షేత్రంలోని మొక్కల నుంచే లభిస్తుంది. తేనెటీగల్లో ఎపిస్ మిల్లిఫెరా రకం మంచి లాభదాయకం. మొదట రెండు కాలనీలతో ప్రారంభించి, తర్వాత పుప్పొడి లభ్యతను బట్టి కాలనీల సంఖ్యను పెంచుకోవచ్చు. తేనెటీగల పెంపకం వల్ల ఉప ఉత్పత్తులైన మైనం, రాజాహారం, విషం, ప్రోపోటెన్లు లభిస్తాయి. పరపరాగ సంపర్క పంటల్లో అధిక దిగుబడులు రావడానికి తేనెటీగలు తోడ్పడతాయి.

తేనెటీగలకు మకరందం, పుప్పొడినందించే మొక్కల్లో ఉసిరి, నేరేడు, కుంకుడు, టేకు, కానుగ, యూకలిప్టస్, మునగ, నిమ్మ, నారింజ, బత్తాయి, జీడిమామిడి, అరటి, దానిమ్మ, తాడి, పుచ్చ, పామాయిల్ వంటి మొక్కలను పొలం గట్ల పైన లేదా ప్రధాన పంటగా సాగుచేస్తే పంటతో ఆదాయమే గాక, తేనెటీగల పెంపకంతో అదనపు ఆదాయం లభిస్తుంది.

**9. పట్టు పురుగుల పెంపకం :**

మల్బరీ తోట కొరకు సుమారు 10 సెంట్ల భూమిని కేటాయించుకుంటే పొలంలో పట్టుపురుగుల యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. వీటిలో బొంబెక్స్ మోరి, ఎరి పట్టు పురుగులు ముఖ్యమైనవి. ఒకసారి పెంచిన తోట సుమారు పన్నెండేళ్ళవరకు కావాల్సిన మల్బరీ ఆకులనందిస్తూ ఏడాదికి 30–40 టన్నుల దిగుబడినిస్తుంది.

పట్టు పురుగుల పెంపకం, యూనిట్ నిర్వహణకు కావాల్సిన సామగ్రిని సబ్సిడీ రూపంలో అందిస్తున్నారు. ఈ పరిశ్రమలో పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ. అంతేగాకుండా ప్రకృతి వైపరీత్యాలు రైతును కుంగదీయకుండా ప్రతి 2–3 నెలలకొకసారి పంట చేతికందే అదనపు ఆదాయ మార్గంగా ఉంటుంది. ■

## ఎరువుల ధరలు తగ్గాయ్ !

ప్రస్తుతం వ్యవసాయం ఎంతో భారంగా మారిన తరుణంలో రైతులకు కొంత ఊరటనిచ్చేలా ఎరువుల ధరలను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకున్నది. ఎరువుల తయారీకి ఉపయోగించే ముడి పదార్థాల ధరలు తగ్గడంతో కేంద్ర ఎరువులు, రసాయన మంత్రిత్వ శాఖ ఎరువుల ఉత్పత్తి కంపెనీలతో సంప్రదింపులు జరిపింది. ముడి పదార్థాల ధరలు తగ్గినందున ఎరువుల ధరలను తగ్గించాలని చేసిన విజ్ఞప్తి మేరకు ఎరువుల కంపెనీలు ధరలను తగ్గించడానికి సానుకూలంగా స్పందించాయి. దీంతో కాంప్లెక్స్ ఎరువుల ధరలు భారీగా తగ్గనున్నాయి. తగ్గించిన ధరలకే రైతులకు ఎరువులను విక్రయించాలని ఆయా కంపెనీలు తమ డీలర్లకు సమాచారం ఇచ్చాయి.

కాంప్లెక్స్ ఎరువులైన సీఐఎల్ 20–20–0–13 ధర ఇప్పటివరకూ 1,350 రూపాయలు ఉండగా, ఇది 150 రూపాయలు తగ్గి 1,200 రూపాయలు అయింది. ఇదే రీతిలో అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గాయి. దీంతో ఫ్యాక్ట్ 20–20–0–13 ఎరువు 1,390 రూపాయలు ఉండగా, అది. 1,225 రూపాయలు, అమ్మోనియం సల్ఫేట్ 1100 రూపాయలు ఉండగా అది 1,000 రూపాయలకు, స్పిక్ 20–20–0–13 ధర 1,375 రూపాయలు ఉండగా అది 1,275 రూపాయలకు, డై అమ్మోనియమ్ ఫాస్ఫేట్ (డీఏపీ) 1,350 రూపాయలు ఉండగా దాన్ని 1,350 రూపాయలు, సీఐఎల్ 20–0–13 ధర 1,200 రూపాయలు ఉండగా అది 1,200 రూపాయలు, సీఐఎల్ 28–28–0 ఎరువుల ధర ఇప్పటివరకూ 1,700 రూపాయల ఉండగా ఆది 1,500 రూపాయలకు తగ్గింది.

**యూరియాపై సబ్సిడీ మరో మూడేళ్ళు**

జూన్ 28 వ తేదీన కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశమై, రైతులకు సంబంధించి కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి ప్రణామ్, యూరియా గోల్డ్‌స్కీమ్‌ల కొనసాగింపునకు పచ్చజెండా ఊపింది. ప్రస్తుతం ఉన్న యూరియా సబ్సిడీ పథకాన్ని మరో మూడేళ్ల పాటు కొనసాగించాలని నిర్ణయించారు. ■

# నాబార్డ్ తోడ్పాటుతో రాగంపేట మహిళా ఎఫ్ పి ఓ చే గ్రామ దుకాణ్ !

ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ మండలంలో 2019 లో నాబార్డ్ ప్రోత్సాహంతో 'రాగంపేట మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ' (ఎఫ్ పి ఓ) ఏర్పాటైంది.



ఈ ఎఫ్ పి ఓ లో ఆరు గ్రామాల నుంచి 500 మందికి పైగా మహిళలు సభ్యులుగా వున్నారు. వీరు ప్రస్తుతం తమ పొలాలకు పెట్టవలసిన పెట్టుబడుల కొనుగోలు, రైతులకు టార్పాలిన్లు, ఎక్స్పైడ్ బ్యాటరీల అమ్మకం సాగిస్తున్నారు.

మహిళా రైతులకు వ్యవసాయేతర జీవనోపాధుల విస్తరణలో భాగంగా, ఈ ఎఫ్ పి ఓ కు గ్రామ దుకాణం ఏర్పాటు చేసుకోవడానికి 5,00,000 రూపాయలను నాబార్డ్ మంజూరు చేసింది. ఈ దుకాణంలో లంగాలు, చీరల ఫాల్స్, లైనింగ్ క్లాత్ వంటి అనేకం లభిస్తాయి. వరంగల్లు, హైదరాబాదుల లోని అంగళ్ళకు హోల్‌సేల్ ధరలకు వీటిని విక్రయిస్తారు. మిగతా 20 శాతం సరకును ఈ ఎఫ్



పి ఓ బ్రాండ్ పేరుతో పొరుగు మండలాల గ్రామాలలో రిటైల్ ధరలకు అమ్ముతారు. ముడి సరకును ప్రస్తుతం హైదరాబాదు శివార్ల నుంచి సమకూర్చుకుంటున్నారు.

2023 జూన్ 14 వ తేదీన నరసంపేట ఎం ఎల్ ఏ శ్రీ పెద్ది సుదర్శన రెడ్డి గ్రామ దుకాణాన్ని ప్రారంభించారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్లు, వరంగల్లు క్లస్టర్, ఎఫ్ పి ఓ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 5 కుట్టు మిషన్లను, 600 వస్త్రాలను సిద్ధంగా వుంచారు. ఒకరితర్వాత ఒకరుగా ఈ ఐదు మిషన్లపై 10 మంది మహిళలు కుట్టుపని చేస్తారు.

ఒక్కొక్క మహిళ సునాయాసంగా రోజుకు 80 వస్త్రాలను కుట్టగలుగుతారు. వారు రోజుకు 700 నుంచి 800 వస్త్రాలను కుట్టాలనుకుంటున్నారు. ఒక్కొక్క వస్త్రాన్ని




కుట్టినందుకు వారికి 10 రూపాయలు లభిస్తాయి. ఒక్కొక్క మహిళ రోజుకు 400 రూపాయల వరకు సంపాదించ గలుగుతారు. వచ్చే 6 నెలలలో నాబార్డ్, సెర్ప్ – డి ఆర్ డి ఏ సహకారంతో 100 మంది ఎఫ్ పి ఓ సభ్యులకు జీవనోపాధి కల్పించాలని ఈ ఎఫ్ పి ఓ సంకల్పించింది. ఇందుకోసం కనీసం 50కి పైగా కుట్టు మిషన్లను సమకూర్చుకోవాలని, పురుషుల వెస్ట్స్, స్త్రీల నైటీలు కూడా కుట్టాలని వారు ప్రణాళిక వేసుకున్నారు. ■

అనుబంధం అంటే ఒకరిపట్ల ఒకరికి వుండే ఆత్మీయతే కాని, దీర్ఘకాల పరిచయమో, ఇచ్చిపుచ్చుకోడమో కాదు

# ఎస్ హెచ్ జి లచే వస్త్రపు సంచుల తయారీకి నాబార్డ్ ప్రోత్సాహం

**ఎస్** హెచ్ జి సభ్యుల ద్వారా పర్యావరణ హిత జీవనోపాధులను ప్రోత్సహించడంలో భాగంగా హనుమకొండ జిల్లాలో 2022–23 సంవత్సరంలో 'వస్త్రపు సంచుల' (క్లాత్ బ్యాగ్స్) తయారీకి సంబంధించిన 'జీవనోపాధులు,



పారిశ్రామికాభివృద్ధి కార్యక్రమాన్ని' (ఎల్ డి ఇ పి) నాబార్డ్ మంజూరు చేసింది. 'ఆమ్మ మైట్ హోప్స్' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలు చేయడం జరిగింది.

కేశవపూర్, హసన్‌పర్తి అనే రెండు గ్రామాలకు చెందిన 90 మంది ఎస్ హెచ్ జి సభ్యులకు (మూడు బ్యాచులలో) అనేకరకాలుగా ఉపయోగపడే పర్యావరణహిత 'వస్త్రపు సంచుల'ను తయారుచేసే నైపుణ్యాలను అందించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమ నిర్వహణకు నాబార్డ్ 7.47 లక్షల రూపాయలు మంజూరు చేసింది. ఇందులోనే 'కీలక మౌలిక సదుపాయాల కల్పన'లో భాగంగా, ఆరు జుకీ మిషన్ల కొనుగోలుకు 1.02 లక్షల రూపాయలు సమకూర్చింది.



పర్యావరణహిత 'వస్త్రపు సంచుల'ను డెనిమ్, రేయాన్ వంటి ప్రత్యేక వస్త్రాలతో తయారుచేస్తారు. ముడిసరుకును వరంగల్లు, హైదరాబాదు నుంచి సమకూర్చుకుంటారు. ఈ కార్యక్రమాన్ని హనుమకొండ జిల్లాలో 2023 ఏప్రిల్ 13 వ తేదీన ప్రారంభించడం జరిగింది.

నాబార్డ్ తెలంగాణా సి జి ఎం శ్రీమతి సుశీల చింతల, నాబార్డ్ ముంబై ప్రధాన కార్యాలయం వ్యవసాయరంగ అభివృద్ధిశాఖ (ఎఫ్ ఎస్ డి డి) సి జి ఎం శ్రీ సి ఎస్ ఆర్ మూర్తి కీలక మౌలిక సదుపాయాలను ప్రారంభించారు. ఇప్పటివరకు 60 మంది ఎస్ హెచ్ జి సభ్యులు శిక్షణ పొందారు. తక్షణం ఉత్పత్తి ప్రారంభించడానికి వీలుగా కావేరి ఎస్ హెచ్ జి, ధనలక్ష్మి ఎస్ హెచ్ జి లకు నాలుగు జుకి మిషన్లను అందజేయడం జరిగింది. ఒక్కొక్క జుకి మిషన్‌తో రోజుకు 200 నుంచి 250 వస్త్రపు సంచులను తయారుచేయగలుగుతారు.

వరంగల్లు మునిసిపల్ కార్పొరేషన్ (జి డబ్ల్యు ఎం సి) పరిధిలోనే ఈ సంచులకు ఎంతో గిరాకీ వుంది. డి–మార్ట్, రిలయన్స్ ఫ్రెష్, స్పెన్సర్ వంటి స్థానిక మార్ట్‌లతో, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమ వేదికలతో, డి ఆర్ డి ఏ, సెర్ప్ సంస్థల ద్వారా ఎస్ హెచ్ జి గ్రామ, మండల, జిల్లా సమాఖ్యలతోను అనుసంధానమై ఈ సంచుల ఇతోధిక మార్కెటింగ్‌కు కృషి జరుగుతున్నది. ■

# నల్లమాడ రైతు సమాఖ్య విజయగాధ !

-సి.గోపాలరాజు, సి.రాజశేఖర్ రెడ్డి, యన్.నరసింహప్ప

ఏపిమాస్ సంస్థ జులై 2001 సంవత్సరంలో ప్రారంభించిన నాటి నుండి ఉభయ అనంతపురం జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి మరియు తోడ్పాటుకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థతో కలసి పని చేస్తున్నది. ఈ ప్రయాణంలో భాగంగా ఓబుల దేవర చెరువు (ఓ.డి సి.) క్లస్టర్‌ను మోడల్ క్లస్టర్‌గా చేసుకొని 2007 సంవత్సరం నుండి 2010 సంవత్సరం వరకు ఓ.డి.సి, నల్లమాడ, నల్లచెరువు, తనకల్లు మండలాలలో స్వయం



సహాయక సంఘాల ఉద్యమంలో ఏపీమాస్ భాగస్వామ్యమైనది.

దేశంలో అత్యంత కరువు జిల్లాలలో జైసల్మేర్ తరువాత అనంతపురం జిల్లా రెండవది. అనంతపురం జిల్లాలో సగటు వర్షపాతం 550 మి.మీ. ఉంటే నల్లమాడ మండలంలో 520 మీ. మీటర్లు ఉంటుంది. అంటే జిల్లా సగటు వర్షపాతం కంటే తక్కువన్నమాట.

చాలామంది రైతులు వర్షాలు పడక పంటలు పండించలేక వలసలు వెళుతున్న తరుణంలో ఏపిమాస్ సంస్థ నల్లమాడ మండలంనందు 2009 సంవత్సరం నుండి -2018 మార్చి వరకు రెండు మెగా వాటర్‌షెడ్ ప్రాజెక్టును 12 మైక్రో వాటర్‌షెడ్ కార్యక్రమాలను 8 గ్రామ పంచాయతీ లలో 10,000 హెక్టార్ల భూమిలో దాదాపు 12 కోట్ల రూపాయల ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేసినది.

వాటర్ షెడ్ కార్యక్రమంలో భాగంగా భూసార సంరక్షణా కార్యక్రమాలు, నీటి సమీకరణ కార్యమాలు, వ్యవసాయ అటవీకరణలో భాగంగా రోడ్డుకిరువైపులా 8 కిలోమీటర్లు (అవెన్యూ ప్లాంటేషన్) మొక్కల పెంపకం, 300 మంది చిన్న, సన్నకారు రైతులకు వర్షాధారిత తోటల పెంపకంలో భాగంగా 1000 ఎకరాలలో మామిడి మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలు, పరోక్షంగా (ఎంట్రీ పాయింట్ కార్యక్రమాలు) పాడి అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామ సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వ హించింది. వర్షాలు బాగా పడటంతో వ్యవసాయ భూములలో నీటికుంటలు, ట్రెంచులు, చెరువులు, బావులు, చెక్ డామ్స్ నిండి బోర్లలో నీటి నిల్వ పెరగడంతో వలస వెళ్ళిన రైతులు తిరిగి స్వంత గ్రామాలకు వచ్చి, మళ్ళీ పంటలు పెడుతూ రైతులు చెట్లను పెంచుకుంటూ, తమ జీవనోపాధిని పెంపొందించుకున్నారు.

వాటర్ షెడ్ కార్యక్రమాల తరువాత రైతుల కృషి చూసి ఏపిమాస్ సంస్థ 2014-2019 కాలంలో 'గ్రో గ్రీన్ గో గ్రీన్ ... పచ్చదనాన్ని పెంచండి - పచ్చగా ఉండండి' అనే జి4 ప్రాజెక్టును నల్లమాడ మండలంలో వాటర్ షెడ్ నిర్వహించిన పంచాయతీలలో అమలు చేసింది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా సమీకృత వ్యవసాయం, సంస్థాగత నిర్మాణం, పచ్చదనం పెంపుదల వంటి కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది.

సంస్థాగత నిర్మాణంలో భాగంగా 2016 -2017 సంవత్సరం నుండి గ్రామాలలో రైతు సంఘాలు, పంచాయతి స్థాయిలో గ్రామ రైతు సంఘాలు, మండల స్థాయిలో 'మండల సమాఖ్య' ఏర్పాటు చేయడం జరిగింది. 2017వ సంవత్సరంలో గ్రామ రైతు సంఘాలను, మండల సమాఖ్యను ఏపీ మ్యాక్స్ యాక్ట్ క్రింద రిజిస్ట్రేషన్ చేశారు. సంఘాలు, సమాఖ్య రైతులకు పంటల విధానం, రైతులు సంఘాలుగా



ఏర్పడటం వలన కలిగే ప్రయోజనాలపైన ఏపిమాస్ శిక్షణలు యిచ్చింది.

**మండల సమాఖ్య అభివృద్ధికి కారణాలు**

- ఏపిమాస్ సంస్థ గ్రామీణ రైతులను సంఘటిత పరచడం.
- 104 రైతు సంఘాలు,8 గ్రామ స్థాయి రైతు సంఘాలలో మొత్తం 1048 మంది వాటాదారులున్నారు.
- రైతులందరూ స్వచ్ఛందంగా సంఘాలుగా ఏర్పడి సభ్యత్వం వాటాధనం చెల్లించి గ్రామ రైతు సంఘాలలో సభ్యత్వం పొందటం.
- శిక్షణల ద్వారా, రైతు సంస్థల వ్యాపార కార్యక్రమాలు, సందర్శనా యాత్రల ద్వారా అవగాహన పొందడం
- ఏపిమాస్ సంస్థ మొదటి మూడు (ఏప్రిల్ 2017-మార్చి 2020) సంవత్సరాలు సమాఖ్యకు నిర్వహణ ఖర్చులు చెల్లించింది
- 2020 ఏప్రిల్ నుండి సమాఖ్య స్వయంగా మార్కెటింగ్ చేసి వచ్చిన లాభంతో రైతు సంస్థ స్వయం నిర్వహణ చేసుకుంటున్నది.
- రైతు సమాఖ్య వ్యాపార నిర్వహణకు కావలసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల లైసెన్సులు, జైన్ ఇరిగేషన్ డీలర్ షిప్, వేరుశెనగ ప్రాసెసింగ్ లైసెన్సులు, వ్యాపార లైసెన్సులు పొంది ఉన్నది.
- సమాఖ్య ద్వారా ఏపీ మార్క్‌ఫెడ్ సహకారంతో మద్దతు ధరకు కందులు, వేరుశనగ కొనుగోలుచేసి రైతులకు సరఫరా చేయడం, రైతులు పండించిన పంటలను గ్రేడింగ్‌చేసి ఇతర కంపెనీలకు అమ్మడం.
- సమాఖ్య మార్కెటింగ్ కి సంబంధించి రైతుకు కావలసిన అన్ని రకాల వ్యవసాయ పరికరాలను, ఎరువులను, పురుగు మందులను, పశువుల దాణాను అందుబాటులో ఉంచడం
- సమాఖ్య మార్కెటింగ్ బలోపేతం కావడానికి సిబ్బంది, సమాఖ్య బిఓడి సభ్యులు వారపు సంతలలో ప్రతి వస్తువు స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి సమాఖ్య ద్వారా అమ్ముతున్న వస్తువులు, వాటి ధరలకు సంబంధించిన వివరాలతో కరపత్రాలను యివ్వడం
- రైతు సేవాకేంద్రం ద్వారా వ్యవసాయ పరికరాలను సరసమైన ధరలకు బాడుగకు ఇవ్వడం
- సమాఖ్య అభివృద్ధి కోసం బిఓడి సభ్యులు కమిటీలుగా ఏర్పాటు కావడం (పర్యవేక్షణ కమిటీ, కొనుగోలు కమిటీ, అమ్మకపు కమిటీ, స్టాక్ వెరిఫికేషన్ కమిటీ)
- సిబ్బంది , బిఓడి సభ్యులు సమాఖ్య మార్కెటింగ్‌ను తమ స్వంత పనిగా భావించి పనిచేయడం
- వ్యాపార కార్యక్రమాలు, ప్రణాళికలు చేయడం,
- రైతులకు అవసరమైన ఇన్పుట్‌ను ముందుగానే ప్రణాళిక ప్రకారంగా అందుబాటులో ఉంచడం
- **సమాఖ్య వ్యాపారాలు :** గడ్డి తీయడానికి తొనిక ములికెలు,

**2017 ఏప్రిల్ నుండి 2023 మార్చి వరకు ఇన్ పుట్, అవుట్ పుట్ వ్యాపార లావాదేవీలు**

| ఇన్ పుట్ మార్కెటింగ్ | | | | అవుట్ పుట్ మార్కెటింగ్ | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| వస్తువుల సంఖ్య | టర్నోవర్ | లాభనష్టాలు | రైతుల సంఖ్య | వస్తువుల సంఖ్య | పరిమాణం | మొత్తం టర్నోవర్ | లాభం/నష్టం | రైతుల సంఖ్య |
| 85 | 14714970 | 6772755 | 6036 | 19 | 1347.55 | 81226200 | 1583864 | 2605 |



తొనిక్కట్టెలు, పారలు, గడార్లు, కొమ్మలు కత్తిరీయడానికి సికేచర్స్, గుజ్జేడ్లు, కొడివెండ్లు, గోళాలు, టార్పాలిన్ పట్టలు, స్ప్రింక్లర్స్, విడి భాగాలు, డ్రిప్. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు.

- రైతులను ఇతర సమాఖ్యలకు సందర్శన యాత్రలకు తీసుకెళ్ళి అవగాహన కల్పించడం
- ప్రతి రోజు వ్యాపారం ద్వారా వచ్చిన నగదును బ్యాంక్‌లో జమ చేయడం, ప్రతి సభ్యునికి లావాదేవీల వివరాలను వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వడం
- క్రమం తప్పకుండా ప్రతినెలా పాలకవర్గ సమావేశాలు జరపడం, ప్రతి సంవత్సరం ఆడిట్, జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించడం
- పాలకవర్గ ఎన్నిక, రిటర్నులు దాఖలు చేయడం, క్రమం తప్పక జిఎస్‌టి ఫైల్ చేయడం
- సర్వసభ్య సమావేశం తీర్మానాల ప్రకారం సభ్య సంఘాలకు బోనస్ పంపిణీ చేయడం
- ఆర్థిక సంవత్సరంలో జరిగే కార్యక్రమాలు, లావాదేవీలు మహాసభ ద్వారా ప్రతి రైతుకు తెలియచేసి వచ్చే సంవత్సరానికి ప్రణాళికలు చేయడం.

రైతు సమాఖ్య బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు, సిబ్బంది రైతులకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ రైతుల మెప్పు పొందుతున్నారు. ■

## చిన్న కారణాలకు గర్భసంచి తీయించుకోవడం మంచిదికాదు

నెలసరి సమయంలో ఎక్కువ రోజులు రక్తస్రావం అవుతుందని, అధిక రక్తస్రావం అవుతుందని గర్భసంచి తీయించుకోవడం మంచిది కాదు. ముందుగా దీనికి గల కారణాన్ని తెలుసుకోవాలి. ఇందుకోసం అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకోవాలి. దీని ద్వారా ఫైబ్రాయిడ్స్ ఏమైనా ఉన్నాయా? గర్భాశయ పొర ఏమైనా పెరిగిందా? అనే విషయాలు తెలుస్తాయి. కొంతమందిలో ఈ సమస్యలేవీ లేకపోయినా థైరాయిడ్ హార్మోన్ హెచ్చుతగ్గుల వల్ల అధిక రక్తస్రావం అవుతుంటుంది. మరికొంతమందిలో గర్భాశయం లోపల పెల్విక్ ఇన్ఫెక్షన్ ఉండడం వల్ల కూడా ఈ సమస్య వస్తుంటుంది. కాబట్టి, వీటికి సంబంధించిన పరీక్షలతో పాటు రక్తపరీక్ష చేయించుకోవడం వల్ల సమస్యను గుర్తించచ్చు. ఒకవేళ ఈ రిపోర్టులన్నీ నార్మల్‌గా ఉన్నా గర్భసంచి తీయించుకోవడం అనేది సరైన నిర్ణయం కాదు.

కొంతమంది 35 ఏళ్ల వయసుకే గర్భసంచి తొలగించుకుంటున్నారు. ఈ వయసులో గర్భసంచి తీయించుకోవడం మంచిది కాదు. దీనివల్ల దీర్ఘకాలంలో అండాశయాల పని తీరు తగ్గిపోతుంది. ఫలితంగా మెనోపాజ్ త్వరగా వస్తుంది. అధిక రక్తస్రావం, వైట్ డిశ్చార్జ్ వంటి చిన్న చిన్న కారణాలకే కొంతమంది గర్భసంచి తొలగించుకుంటున్నారు. కానీ అది సరైన నిర్ణయం కాదు. సమస్య తీవ్రంగా వుంటే ప్రత్యామ్నాయం చూడాలి.

అధిక రక్తస్రావం సమస్యకు కాపర్-టి చక్కటి పరిష్కారం. దీనిని గర్భాశయంలో అమరుస్తారు. దీనివల్ల బ్లీడింగ్ సమస్య 90 శాతం తగ్గుతుంది. కొంతమంది అధిక రక్తస్రావం లేకపోయినా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుంటారు. ఇలాంటి వారు ఐయుడి వేయించుకోవడం మంచిది. దీనిద్వారా హిస్టరెక్టమీ సర్జరీలను కూడా అరికట్టవచ్చు. అంతేకానీ చిన్న చిన్న కారణాలకు గర్భసంచి తొలగించుకోవడం మంచిది కాదు. ■

# పరపతి సంఘాలు ఆదాయం పన్ను కట్టక్కర్లేదు!

## సుప్రీంకోర్టు స్పష్టీకరణతో తొలగిన సందిగ్ధం ..... ఇది చరిత్రాత్మక తీర్పు : నాఫ్కబ్

దేశంలోని సహకార పరపతి సంఘాల (కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీల)కు పెద్ద ఉపశమనం కలిగించే తీర్పును సుప్రీంకోర్టు ఇటీవల (మే 9న) వెలువరించింది. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80ఎ(2)లో పేర్కొన్న బ్యాంకుల జాబితాలోకి సహకార పరపతి సంఘాలు రావని, కాబట్టి ఈ సొసైటీలకు ఆదాయవు పన్ను మినహాయింపు కొనసాగుతుందని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ అప్పీల్ (8719/2022)ను కొట్టివేస్తూ పరపతి సంఘాలకు పన్ను మినహాయింపు కొనసాగుతుందని సుప్రీంకోర్టు పేర్కొంది. అర్బన్ సహకార బ్యాంకులు, క్రెడిట్ సొసైటీల జాతీయ సమాఖ్య (నాఫ్కబ్) సుప్రీంకోర్టు తీర్పు ప్రతిని తన సభ్యులకు అందించింది.

ఆదాయపు పన్ను కమిషనర్ వర్సెస్ అన్నాసాహెబ్ పాటిల్ మధాడి కమ్‌గర్ సహకారి పత్పేధి లిమిటెడ్ (సివిల్ అప్పీల్ నం. 8719/2022) క్రెడిట్ సొసైటీ కేసులో తీర్పు చెప్పిన సుప్రీంకోర్టు ఆదాయపు పన్ను చట్టం – 1961లోని 80 (2) ప్రకారం ఆదాయపు పన్ను మినహాయింపునకు సహకార పరపతి సంఘాలు అర్హమైనవేనని ధ్రువీకరిం చింది. రుణాలు ఇచ్చే సహకార సంఘులు ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80(పి) (4) నిబంధనల ప్రకారం తగ్గింపును కోరలేవని, కాబట్టి క్రెడిట్ సొసైటీలపై పన్ను విధించాలని దాఖలైన అప్పీలును సుప్రీంకోర్టు కొట్టివేసింది.

తీర్పులో ఇంకా ఇలా ఉంది. 'తన సభ్యులకు మాత్రమే రుణం ఇస్తున్న సహకార సంఘాలను బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్ –1949 ప్రకారం కోఆపరేటివ్ బ్యాంక్ /ఇతర బ్యాంక్‌తో సమానమని చెప్పలేం. ప్రజలకు పెద్ద ఎత్తున రుణాలు ఇవ్వడంతో పాటు ఇతర సేవలందించే బ్యాంకు లకు తన సభ్యులకు మాత్రమే రుణాలిచ్చే క్రెడిట్ సొసైటీలను ఒకే గాటన కట్టలేము. వీటిమధ్య చాలా వ్యత్యాసం ఉంది. కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల బోర్డు సర్క్యులర్లు, బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్‌లో బ్యాంక్‌కు ఇచ్చిన నిర్వచనాన్ని పరిగణనలోకి తీసుకున్నప్పటికీ,సెక్షన్ 80పి(4) నిబంధనలు క్రెడిట్ సొసైటీకి వర్తించవు. ఆదాయపు పన్నుచట్టం–1961 80(పి) ప్రకారం క్రెడిట్ సొసైటీకి పన్ను మినహాయింపు ప్రయోజనం పొందే అర్హత ఉంది.

**ఇది చరిత్రాత్మక తీర్పు : నాఫ్కబ్**

ఇది చరిత్రాత్మక తీర్పని అర్బన్ సహకార బ్యాంకులు, క్రెడిట్ సొసైటీల జాతీయ సమాఖ్య (నాఫ్కబ్) అధ్యక్షులు జ్యోతీంద్ర మహతా అభివర్ణించారు. ఇది చరిత్రాత్మకమైన తీర్పు. ఎందుకంటే, చాలా సంవత్సరాలుగా మేం ఈ సమస్యతో సతమతమవుతున్నాం. కానీ, ఇప్పుడు అత్యున్నత సుప్రీంకోర్టు తీర్పుయివ్వటంతో మాకు ఉపశమనం కలిగిందన్నారు. దేశంలోని వివిధ కోర్టుల్లో క్రెడిట్ సొసైటీలకు ఆదాయపు పన్ను మినహాయింపునకు సంబంధించిన అనేక కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దేశంలోని అన్ని పరపతి సంఘాలకు ఈ తీర్పునే వర్తింపజేయాలని ఆయన అన్నారు.

మహారాష్ట్ర స్టేట్ కోఆపరేటివ్ క్రెడిల్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్ కాకా కోయటే ఈ తీర్పుపై స్పందిస్తూ, దేశంలోని పరపతి సహకార సంఘాలకు అనుకూలంగా తీర్పు రావటం సంతోషదాయకం. ఈ తీర్పు ఆదాయపు పన్ను కేసులు ఎదుర్కొంటున్న అన్ని క్రెడిట్ సొసైటీలకూ వర్తిస్తుందన్నారు. సుప్రీం తీర్పు వచ్చిన వెంటనే కేంద్ర సహకార శాఖ ట్విట్టర్‌లో ఈ విషయాన్ని పోస్ట్ చేసింది. సహకార భారతి, నేషనల్ కోఆపరేటివ్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సియుఐ), నాఫ్కబ్‌లు కూడా కేంద్ర ఆర్థికమంత్రికి, సంబంధిత అధికారులకు క్రెడిట్ సొసైటీలు ఎదుర్కొంటున్న ఈ సమస్యపై చాలాసార్లు లేఖలు రాసిన విషయం తెలిసిందే. ■

**జీవితమంటే మంచి మనిషిని వెదికి పట్టుకోవడం కాదు, మంచి అనుబంధం ఏర్పరచుకోవడం**

# పంటలు ముందే వేస్తే అకాల వర్షాల బెడద వుండదు !

గతంలో తెలంగాణాలో సాగునీటి సమస్య కారణంగా వాన పడితే గానీ దుక్కి దున్నే పరిస్థితి ఉండేది కాదు. కానీ ఇప్పుడు కథ మారింది. పుష్కలమైన సాగునీళ్లు అందుబాటులోకి వచ్చాయి. నడి వేసవిలోనూ చెరువులు మత్తళ్లు దుంకుతున్నయి. బోర్లు, బావులు ఊటలు బారుతున్నయి. రైతులు ఎప్పుడనుకుంటే అప్పుడు దుక్కి దున్నుకోవచ్చు. పంట సాగు చేసుకోవచ్చు. కానీ యిప్పటికీ రైతులు పాత పద్ధతినే అవలంబిస్తున్నారు. దీంతో అకాల వర్షాల కారణంగా ఆరుగాలం కష్టించి పండించిన పంట కడగండ్ల పాలవుతున్నది. రైతుల కష్టం వానపాలవుతున్నది.

అందుకే రైతుల కష్టాన్ని కడగండ్లు దోచుకోకుండా, అకాల వర్షాల నుంచి పంటలను కాపాడేందుకు వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. వానా కాలం, యాసంగి సాగు కాలాన్ని నెలరోజులు ముందుకు జరిపేలా ప్రణాళికలు రూపొం దించింది. ఏ జిల్లాలో ఎప్పుడు నార్లు పోసుకోవాలి? ఎప్పుడు కోతలు పూర్తి చేయాలి? అనే అంశాలపై ప్రణాళికలు రూపొందించింది. ఆ దిశగా రైతులను సన్నద్ధం చేసేందుకు చర్యలు చేపట్టింది.



**సాగు నెల ముందుకు..**

సాధారణంగా రైతులు వానకాలం సాగుకు జులైలో నార్లుపోసి ఆగస్టు వరకు నాట్లు వేస్తుంటారు. డిసెంబర్‌లో వరికోత కోస్తారు. యాసంగిలో డిసెంబర్‌లో నారు పోసి జనవరి, ఫిబ్రవరి వరకు నాట్లు వేస్తారు. దీంతో మే నెలలో కోతలు కోస్తారు. వానకాలం సీజన్‌లో అక్టోబర్‌లో, యాసంగి సీజన్‌లో మార్చి రెండో వారం నుంచి, ఏప్రిల్ వరకు అకాల వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలు వానపాలవుతున్నాయి. చివరికి రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. ప్రకృతి విసిరే ఈ సవాల్‌ను ఎదుర్కొనేందుకు ఒకే ఒక్క మార్గం సాగు సమయాన్ని నెల ముందుకు జరపడం. ఈ లెక్కన వానకాలం సాగుకు జూన్‌లో నార్లు పోసుకొని, జులైలో నాట్లు పూర్తి చేయాలి. యాసంగిలో అయితే నవంబర్‌లో నార్లు పోసుకొని, డిసెంబర్‌లో నాట్లు పూర్తి చేయాలి. ఈ విధానం అమలుచేస్తే రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

**పంట భద్రత రైతు చేతుల్లోనే..**

ప్రకృతి వైపరీత్యాలను అడ్డుకోవడం సాధ్యం కాదు కానీ వాటి నుంచి పంటలను రక్షించుకోవడం మన చేతుల్లోనే ఉన్నది. రైతులు ముందు జాగ్రత్త పడితే ఆరుగాలం కష్టించి పండించిన పంట ఫలితాన్ని అనుభవించవచ్చు. లేనిపక్షంలో రైతుల శ్రమ కడగండ్ల పాలవుతుంది. రాష్ట్రంలో గతంలో మాదిరిగా కరువు పరిస్థితులు లేవు. పుష్కలమైన సాగు నీళ్లు ఉన్నాయి. పెట్టుబడి కోసం వెదుకులాట లేదు. సీజన్‌కు ముందే రైతులకు ప్రభుత్వం రైతుబంధు రూపంలో పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నది. ఇప్పుడు ఎరువులు, విత్తనాల కొరత లేదు. సీజన్‌కు ముందే అవన్నీ సిద్ధం చేస్తున్నది తెలంగాణ ప్రభుత్వం.

కోతల ప్రారంభానికి ముందే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మొత్తం పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నది. ప్రభుత్వం ఇన్ని చేస్తున్నప్పటికీ అకాల వర్షాలు రైతులకు కడగండ్లనే మిగులుస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు తమ పంటలను అకాల వర్షాల నుంచి కాపాడుకునేందుకు ముందుకు రావాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. అకాల వర్షాల నుంచి పంటలను కాపాడుకునే అవకాశం రైతుల చేతుల్లోనే ఉన్నదని చెప్తున్నారు. ప్రభుత్వం సూచించినట్టుగా సాగును నెల ముందుగానే ప్రారంభించాలని

కోరుతున్నారు.

**యాసంగి సాగు వివరాలు**

- యాసంగిలో ఏ రకమైనప్పటికీ నవంబర్ 15-20వ తేదీ వరకు నారు పోసుకోవాలి.
- డిసెంబర్ లోపు నాట్లు పూర్తి చేసుకోవాలి.
- యాసంగి వరి కోతను మార్చి మధ్య నుంచి ఏప్రిల్ మొదటి వారం లోపు పూర్తి చేయాలి.

**వానకాలం సాగు ఇలా..**

- సాగు చేసేవి ఎలాంటి రకాలైనప్పటికీ జులై నెలాఖరు వరకు వానకాలంలో వరి నాట్లను పూర్తి చేసుకోవాలి. వానకాలం వరి పంట కోతను అక్టోబర్ 3వ వారం నుంచి నవంబర్ మొదటి వారంలోపు పూర్తి చేయాలి.

**నెల రోజుల ముందస్తుతో ప్రయోజనాలు**

- అక్టోబర్‌లో, మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసే వడగండ్లతో కూడిన అకాల వర్షాలకు వరి పంట నష్టపోకుండా ఉంటుంది.
- యాసంగిలో మార్చి వరకు కోతలు పూర్తైతే నూక శాతం తక్కువై.. ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు.
- రెండు సీజన్లలో ముందస్తుగా పంట చేతికొస్తే మార్కెట్‌లో డిమాండ్ ఉంటుంది. మద్దతు ధరకు మించిన ధర లభిస్తుంది.

**యాసంగి నారు కోసం మడి వదులుకోవాలి**

యాసంగి కోసం నవంబర్ 20లోపు నార్లు పోసుకోవాలి. అయితే వానకాలం వరి కోతలు నవంబర్ మొదటి వారంలోపు పూర్తవుతాయి. ఈ నేపథ్యంలో యాసంగి వరి నారు కోసం ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉంటుంది. దీంతో వానకాలం సాగు సమయంలోనే రైతులు ముందు జాగ్రత్తగా యాసంగి నారు కోసం ఒక చిన్న మడిని వదిలేసుకుంటే బాగుంటుంది. దీంతో వానకాలం వరి కోతలు కాస్త ఆలస్యమైనప్పటికీ వదిలేసిన మడిలో యాసంగి కోసం సరైన సమయంలో నారు పోసుకునే వీలుంటుంది.

## ఉప్పు సరిపోలేదని మళ్లీ మళ్లీ చల్లుకునే అలవాటుందా..?

కొంతమంది భోజనం స్టార్ట్ చేసింది మొదలు ఎండ్ అయ్యేంత వరకూ ఉప్పు చల్లుకుంటూనే ఉంటారు. ఆహారానికి టేస్ట్ అందిస్తుందని తెగ చల్లుకుంటాం కానీ మన జీవిత కాలాన్ని తగ్గించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందనే విషయాన్ని మాత్రం తెలుసుకోము. అదనపు ఉప్పును ఉపయోగించని వ్యక్తులతో పోలిస్తే ఉపయోగించే వారిలో 28 శాతం మంది అకాల మరణానికి గురయ్యే ప్రమాదం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. వాస్తవానికి, మహిళలు వారి ఆరోగ్యంపై ఉప్పు మరింత ముప్పుగా పరిణమిస్తుంది. అదనంగా ఉప్పు వినియోగించే మహిళలు అదనంగా ఉప్పు కలిపితే వారి జీవిత కాలాన్ని దాదాపు 2.28 సంవత్సరాలు తగ్గించుకుంటారని నిపుణులు చెబుతున్నారు.

**ఉప్పు తీసుకోవడం ఎలా తగ్గించాలి?**

1. మీరు మీ ఆహారంలో అదనపు ఉప్పును జోడించవద్దు.
2. ఉప్పును ఆహారంలో చేర్చే ముందు ఎంత తీసుకోవాలనేది తెలుసుకోండి. మీరు ఒక రోజులో ఎంత తింటున్నారో కూడా పరిగణనలోకి తీసుకోవడంలో ఇది మీకు సహాయపడుతుంది.
3. మీరు ఆహారం తినే టేబుల్‌పై ఎప్పుడూ సాల్ట్ షేకర్‌ను ఉంచవద్దు. ఎందుకంటే ఇది టెంప్టేషన్‌ను తగ్గిస్తుంది.
4. ఉప్పగా ఉండే స్నాక్స్ లేదా ఊరగాయలు, పాపడ్‌లు, చిప్స్ వంటి ఆహారాలను పరిమితంగా తీసుకోండి.
5. తక్కువ సోడియం కంటెంట్ ఉన్న ఆహారాన్ని తీసుకోండి. ఇది మీ ఉప్పు తీసుకోవడం నియంత్రించడంలో మీకు సహాయం చేస్తుంది.
6. ఫ్రెష్, ప్రాసెస్ చేయని లేదా కనిష్టంగా ప్రాసెస్ చేసిన ఆహారాలను మాత్రమే ఎంచుకోండి. ఎందుకంటే ప్రాసెస్ చేసిన, ప్యాక్ చేసిన ఆహారాలలో ప్రిజర్వేటివ్స్ ఉండటం వల్ల సోడియం ఎక్కువగా ఉంటుంది.

# 'సహకారం'లో చెలరేగుతున్న అవినీతి !

**ఆం**ధ్రప్రదేశ్ రాష్ట్రంలో సహకార వ్యవస్థ నిర్వీర్య మౌతోంది. రైతులకు పరపతి కల్పించాల్సిన సహకార సంఘాలు ఎన్నికలు లేకుండా అధికారేతర వ్యక్తుల ఏలుబడిలో ఇష్టారాజ్యమైంది. ప్రభుత్వ పెద్దలు, నాబార్డు, సహకారశాఖ ఉన్నతాధికారులు పట్టించుకోకపోతుండటంతో కోట్లాది రూపాయలు స్వాహా అవుతున్నాయి. సెక్షన్ 51 ఎంక్వైరీలు కాగితాలకే పరిమితమయ్యాయి. దొంగ పత్రాలతో తీసుకున్న రుణాల రికవరీపై అధికారులకు శ్రద్ధ కొరవడింది. ఫలితంగా వందలాది సంఘాలు నష్టాల్లో కూరుకుపోతున్నాయి.

సంఘాలు సజావుగా సాగేందుకు దోహదపడే ఉద్యోగుల హెచ్ఆర్ పాలసీ పట్టాలెక్కడం లేదు. పాక్స్ (పీఏసీఎస్)ల కంప్యూటరీకరణ కార్యరూపం దాల్చలేదు. ఇదే క్రమంలో పాక్స్‌ల్లో 50% వాటాలను కార్పొరేట్ సంస్థలు, బడా వ్యాపారులకు కట్టబెడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టసవరణతో ప్రాథమిక సహకార సంఘాలు పూర్తిగా నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని సహకార రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కార్పొరేట్ పాలసీతో రైతుకు నష్టం**

సహకార పరపతి సంఘాల్లో యిప్పటివరకు రైతులే వాటాదారులు. పాక్స్‌లు, డీసీసీబీలు, ఆప్కాబ్ మేనేజ్‌మెంట్ కమిటీలలో యిప్పటివరకు రైతు ప్రతినిధులదే కీలక పాత్ర. చట్టసవరణ వల్ల మూడంచెల సహకార వ్యవస్థలో క్షేత్ర స్థాయిలో ప్రైవేట్ వ్యక్తుల జోక్యం పెరగనుంది. సహకార వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మార్పులకు ఊతమిస్తూ, ప్రైవేట్ వ్యక్తుల భాగస్వామ్యానికి అవకాశం కల్పిస్తూ గతేడాది సెప్టెంబరులో చట్ట సవరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదం తెలిపింది. దీనివల్ల పాక్స్‌ల్లో 50% వాటాలు ప్రైవేట్ వ్యక్తులు, కంపెనీలు, చిట్ ఫండ్స్ కంపెనీల చేతుల్లోకి వెళ్లనున్నాయి. తెలంగాణ, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల్లో ఇలాంటి సవరణలకు ఆస్కారం ఇవ్వక పోవడం గమనార్హం. వైద్యనాథన్ సిఫార్సు మేరకు గతంలో శ్రీ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం చట్టసవరణలతో సహకార సంఘాలకు స్వయం ప్రతిపత్తి కల్పించింది. దీనికి భిన్నంగా వాటి స్వయం ప్రతిపత్తిని దెబ్బ తీసేలా ఈ చట్ట సవరణ ప్రైవేట్ వాటాలకు తలుపులు బార్లా తెరిచింది.

మరో వైపు రాష్ట్రాల జాబితాలో ఉన్న సహకార రంగాన్ని తమ చెప్పు చేతల్లోకి తీసుకునేందుకు కేంద్రప్రభుత్వం ప్రత్యేకంగా సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది. చట్ట సవరణల ప్రకారం ప్రతి సంఘంలో రూ. 50లక్షలపైన 50% వరకు ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలు పెట్టుబడులు పెడతాయి. అంతకు మించి పెట్టుబడులు పెట్టదలచుకుంటే గ్రాంట్ల రూపంలో ఇవ్వొచ్చు. దీనివల్ల ప్రైవేట్ వ్యక్తులకు ఆ సంఘంలో ఓటింగ్ హక్కులు కూడా లభిస్తాయి. ఓటింగ్ హక్కులతో సంఘాలు ప్రైవేట్ పరం కానున్నాయి. మేనేజింగ్ కమిటీల్లోనూ ప్రైవేట్ వ్యక్తుల ఆధిపత్యం పెరగనున్నది.

కార్పొరేట్ పాలసీ విధానాలతో రైతులకు సహకార రుణాలు అందని ద్రాక్షగా మారే ముప్పు ఉంది. వడ్డీలు కూడా ప్రైవేట్ వ్యక్తుల నిర్ణయాల మేరకు పెరిగి, రైతులకు రుణాలు భారమయ్యే పరిస్థితి ఉత్పన్నమౌతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలూ ఇష్టారీతిన పెంచే ప్రమాదం కూడా ఉందని రైతు సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో రెండంచెల వ్యవస్థ అమలులో ఉంది.

ఏపీలోనూ డీసీసీబీలను ఆప్కాబ్‌లో విలీనం చేస్తే, రైతులకు వడ్డీ భారం తగ్గుతుందని రైతు సంఘాలు సూచిస్తున్నాయి. డీసీసీబీలు ఆప్కాబ్ బ్రాంచ్‌లుగా మార్చాలని ఉద్యోగులూ కోరుతున్నా ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. రైతు భరోసా కేంద్రాలను పాక్స్‌లకు అనుసంధానం చేయడానికి సహకార చట్టంలో 115–ఇ అధ్యాయాన్ని కూడా చేర్చారు. ఫలితంగా సంఘాల్లో జరిగే పరపతి, ఇతర లావాదేవీలతో పాటు ఆర్బీకేల్లో చేసే వ్యాపారం కూడా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉందని

భావిస్తున్నారు. ఆర్బీకేల ద్వారా జరిగే ధాన్యసేకరణ కూడా ప్రైవేట్ వ్యక్తుల హస్తగతం అవుతుందన్న మాట వినిపిస్తోంది.

**ఎన్నికలు జరపకుండా కాలయాపన..**

రాష్ట్రంలోని సహకార సంఘాలకు ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరిగి పదేళ్లైంది. 2013 జనవరిలో ఎన్నికలు జరగ్గా, 2018 జనవరితో ముగిసిన ఆ పాలక వర్గాలను అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఆరు నెలల చొప్పున మూడు దఫాలు కొనసాగించింది. 2019 జులైలో ప్రస్తుత ప్రభుత్వం పాత పాలకవర్గాలను రద్దు చేసి, త్రిసభ్య కమిటీలను నియమించింది. కొందరు హైకోర్టును ఆశ్రయించగా, కొవిడ్ కారణంగా ఎన్నికలు జరపలేమని 2020లో ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. 2021లో స్థానిక సంస్థల ఎన్నికలప్పుడు ఎన్నికల సంఘం ఆదేశాలతో అధికారులను పర్సన్ ఇన్‌ఛార్జిలుగా నియమించింది. ఎన్నికల కోడ్ ముగియగానే తిరిగి త్రిసభ్య కమిటీలను కొనసాగించింది. కొవిడ్ అంతమైనా ఇప్పటికీ ఎన్నికలు జరగలేదు.

స్థానిక ప్రజాప్రతినిధుల సిఫారసుల మేరకు త్రిసభ్య కమిటీలకు ప్రతి ఆరు నెలలకు గడువు పెంచుతూ వస్తోంది. తాజాగా జూలై వరకు త్రిసభ్య కమిటీలకు గడువు ఉండగా, ఆ తర్వాతనైనా ఎన్నికలు నిర్వహిస్తారనేది అనుమానంగానే వుంది. త్రిసభ్యకమిటీలు అనేక సంఘాల్లో నిధుల కుంభకోణాలకు తెరదీశాయి. ప్రజాప్రతినిధుల అండదండలు, రెవెన్యూ అధికారుల సహకారంతో బోగస్ పత్రాలను సృష్టించి, పెద్ద మొత్తాల్లో రుణాలను స్వాహా చేశారు. గుంటూరు, కృష్ణా, ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లోని అనేక సహకార సంఘాల్లో రూ.వందల కోట్ల అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. ఈ అవకతవకలపై సహకారశాఖ ఉన్నతాధికారులు సెక్షన్ 51కింద ఎంక్వైరీలకాదేశించి ఏళ్లు గడుస్తున్నా భోక్తల ఆస్తులను జప్తు చేయడం కానీ, కాజేసిన రుణాలను రికవరీ చేసిన దాఖలాలు కానీ లేవు. పాక్స్‌ల కంప్యూటరీకరణకు కేంద్రం నిధులు కేటాయించినా అదీ పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చక అవినీతికి అడ్డులేకపోతోంది.

– ఆంధ్రజ్యోతి సౌజన్యంతో

■

## గ్రామైక్య సంఘంలో నిధుల గోల్‌మాల్

స్వయం సహాయక సంఘాలకు పుస్తక నిర్వహణ చేస్తూ ఆర్థిక లావాదేవీలు నిర్వహించే విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీవోఏ) డబ్బులు కాజేసిన సంఘటన తెలంగాణాలోని స్టేషన్ పెద్దనపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్టేషన్ పెద్దనపల్లిలోని వైష్ణవి గ్రామైక్య సంఘంలో 23 స్వయం సహాయక సంఘాలున్నాయి. స్థానికంగా ఉండే వీవోఏ రూ. 20 లక్షల వరకు సభ్యుల డబ్బులను సొంతానికి వాడుకున్నట్లు సభ్యులు ఆరోపించారు.

వైష్ణవి గ్రామైక్య సంఘంలో యేడాదికి సుమారు కోటి రూపాయల ఆర్థిక లావాదేవీలు జరుగుతాయి. సమావేశం అనంతరం డబ్బులను గ్రామీణ బ్యాంకులో జమ చేయాలి. వీవోఏ కొన్ని డబ్బులు జమ చేసి మిగతా డబ్బులను సొంతానికి వాడుకుంది. సంపూర్ణ స్వయం సహాయ సంఘం సభ్యులు రుణం కావాలని వీవోఏను అడగడంతో ఇంకా రుణం తీరలేదని, ఇవ్వడం వీలుకాదని సభ్యులకు చెప్పింది. అనుమానం వచ్చి బ్యాంకుకు వెళ్లి స్టేట్‌మెంట్ తీసుకుని చెక్ చేయగా రూ.2 లక్షలు బ్యాంకులో జమ చేయలేదని అధికారులు తెలిపారు. ఇటీవల సభ్యులు, అధికారులు వీవోఏను నిలదీయడంతో డబ్బులు కాజేసింది నిజమేనని ఒప్పుకుని, తర్వాత రూ.2 లక్షలను బ్యాంకులో జమ చేసినట్లు సభ్యులు తెలిపారు. దీంతో మరో 22 గ్రూపుల సంఘాల సభ్యులు అప్రమత్తమై బ్యాంకుకు వెళ్లి లావాదేవీలను చెక్ చేయగా అన్ని సంఘాలనుంచి రూ. 20 లక్షల వరకు నిధులు దుర్వినియోగం అయినట్లు గుర్తించి సంఘాల సభ్యులు ఆందోళనకు దిగారు.

వైష్ణవి గ్రామైక్య సంఘంలో జరిగిన అవకతవకలపై డీపీఎం స్వర్ణలత, ఏపీఎం వెంకటేష్‌లు విచారణ చేపట్టారు. సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించి నగదు లావాదేవీలపై పుస్తకాలను పరిశీలించారు. అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని నిధులను రికవరీ చేస్తామని తెలిపారు.

■

# వారసత్వ ఆస్తిలో వాటా కుమార్తెల జన్మహక్కు : హైకోర్టు

వారసత్వ ఆస్తిలో కుమారులతోపాటు కుమార్తెలకు కూడా సమాన హక్కు ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. హిందూ వారసత్వ సవరణ చట్టం–2005 అమల్లోకి వచ్చేనాటికి తండ్రి మరణించారా? లేదా అనే విషయంతో సంబంధం లేదని తెలిపింది. వినీత్‌శర్మ కేసులో సుప్రీంకోర్టు ఈ విషయాన్ని స్పష్టం చేసిందని హైకోర్టు గుర్తు చేసింది. చట్టం అమల్లోకి వచ్చే నాటికి తండ్రి మరణించిన నేపథ్యంలో సవరణ చట్టం వర్తించదన్న వాదనను తోసిపుచ్చింది.

చట్టంలోని సెక్షన్ 6(1) ప్రకారం ఆడపిల్ల జన్మించినప్పుడే వారసత్వ ఆస్తిలో హక్కు సంక్రమిస్తుందని పేర్కొంది. చట్ట నిబంధనలకు అనుగుణంగా తుది ఉత్తర్వులు జారీ చేయాలని అభ్యర్థిస్తూ ట్రయల్ కోర్టులో దరఖాస్తు చేసుకోవాలని పిటిషనర్లకు కోర్టు స్పష్టం చేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి ఇటీవల తీర్పు ఇచ్చారు.

గుంటూరు జిల్లా వడ్లమూడికి చెందిన తురగా రామ్మూర్తికి ఆరుగురు మగ, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. రామ్మూర్తి 1961లో మరణించారు. ఆస్తిలో వాటా ఇచ్చేందుకు సోదరులు, సోదరీమణులు నిరాకరిస్తున్నారంటూ రామ్మూర్తి కుమారుడు ఆనందరావు 1986లో తెనాలి కోర్టులో సూట్ వేశారు. మరోవైపు అన్నదమ్ములతో సమానంగా తమకూ ఆస్తిలో హక్కు కల్పించాలంటూ రామ్మూర్తి ముగ్గురు కుమార్తెలు సీతారావమ్మ, స్వరాజ్యలక్ష్మి, సావిత్రీదేవి ఆ సూట్‌లో అనుబంధ పిటిషన్ వేశారు. సివిల్ కోర్టు వీరికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది.

ఈ ఉత్తర్వులను సమీక్షించాలంటూ రామ్మూర్తి కుమారులు కొందరు తెనాలి కోర్టులో అనుబంధ పిటిషన్ వేశారు. హిందూ వారసత్వ సవరణ చట్టం–2005, అదే ఏడాది సెప్టెంబరు 9న అమల్లోకి వచ్చిందని, ఆ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత మాత్రమే చనిపోయిన వ్యక్తి ఆస్తి నుంచి కుమార్తెలు సమానహక్కులు కోరవచ్చునని పిటిషన్‌లో పేర్కొన్నారు. చట్టాన్ని అంతకుముందున్న కాలానికి వర్తింప జేయడానికి వీల్లేదన్నారు. ఈ వాదనలతో తెనాలి కోర్టు ఏకీభవిస్తూ 2010 ఫిబ్రవరిలో ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో రామ్మూర్తి కుమార్తెలు హైకోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫున పాణిని సోమయాజి వాదనలు వినిపించారు.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

## లైంగిక సమానత్వంలో కొంత మెరుగు!

**స్త్రీ, పురుష తారతమ్యంలో 135 నుంచి 127 స్థానానికి భారత్**

జెండర్‌సూచీలో భారతదేశం తన స్థానాన్ని మెరుగు పరుచుకుంది. దాదాపు ఎనిమిది స్థానాలు దాటుకుని 127వ స్థానంలో నిలిచింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) సంస్థ మొత్తం 146 దేశాలను పరిశీలించి ఈ సూచీలను తయారుచేసింది.

తన వార్షిక నివేదిక 'గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్టు–2023'లో ఈ వివరాలు పొందుపరిచింది. విద్య, ఆర్థిక పరమైన భాగస్వామ్యం, ఉపాధి, రాజకీయ అవకాశాలు, ఆడ శిశు జననాలు, స్త్రీల ఆరోగ్యం, బతుకుతున్న కేసులు తదితర అంశాల ఆధారంగా డబ్ల్యూఈఎఫ్ ఏటా సూచీలను ప్రకటిస్తోంది. 2022 నివేదికలో భారత్ ఈ సూచీల పట్టికలో 135వ స్థానంలో నిలిచింది. ఈసారి 14 శాతం మేర తన పాయింట్లను పెంచుకుని తన స్థానం కాస్త మెరుగుపరుచుకుందని ఈ నివేదిక తెలిపింది.


మన పొరుగుదేశం పాకిస్థాన్ సూచీల పట్టికలో చివరినుంచి నాలుగోస్థానంలో, అంటే 142వ స్థానంలో ఉంది. ఐస్‌లాండ్ వరుసగా 14వ సారి మొదటి స్థానాన్ని సాధించింది.

■

# ఇంగువ సాగుచేస్తే రైతుల దశ తిరుగుతుంది!

**భా**రతీయ వంటగదిలో ఇంగువకి చాలా ప్రత్యేక స్థానం ఉంది. దీనిని వంటకాలలో వాడటం వల్ల ఒక ప్రత్యేక రుచి వస్తుంది. అంతేకాదు ఇంగువలో అద్భుత ఔషధగుణాలు దాగి ఉన్నాయి. దీనిని వాడటం వల్ల అనేక వ్యాధులకి ఉపశమనం లభిస్తుంది. అందుకే చాలామంది దీనిని ఔషధంగా ఉపయోగిస్తారు. ఇంగువను క్రమం తప్పకుండా





తీసుకోవడం వల్ల కడుపుకు సంబంధించిన అనేక వ్యాధులు నయమవుతాయి.

హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, ఉత్తరాఖండ్, పంజాబ్, లడఖ్‌లలో రైతులు పెద్ద ఎత్తున ఇంగువ సాగు చేస్తారు. అంతేకాకుండా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇంగువ సాగుకు రైతులను ప్రోత్సహిస్తోంది. అయితే ఇంగువని చల్లని వాతావరణంలో మాత్రమే సాగు చేస్తారు. కానీ శాస్త్రవేత్తలు ఇంగువ రకాలపై పరిశోధనలు చేస్తున్నారు. తద్వారా దీనిని వేడి ప్రాంతాలలో కూడా సాగు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కిలో ఇంగువ ధర తెలిస్తే ఆశ్చర్యపోతారు. ఇంగువ సాగుకు ఇసుక, బంకమట్టి నేల ఉత్తమంగా చెబుతారు. రైతు సోదరులు ఇసుక, బంకమట్టిలో ఇంగువ సాగు చేస్తే మంచి దిగుబడి సాధించవచ్చు.

ఇంగువ సాగు చేస్తున్న పొలంలో నీటి ఎద్దడి ఉండకూడదు. లేదంటే మొక్కలు దెబ్బ తింటాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో ఇంగువ ధర 35 నుంచి 40 వేల రూపాయల వరకు పలుకుతోంది. రైతు సోదరులు ఒక ఎకరంలో ఇంగువ సాగు చేస్తే పెద్దమొత్తంలో ఆదాయం సంపాదించవచ్చు.

ప్రతి సంవత్సరం 1200 టన్నుల ఇంగువ దిగుమతి ఒక లెక్క ప్రకారం ప్రపంచంలోనే ఇంగువను అత్యధికంగా వినియోగించేది భారతదేశమే. ప్రపంచం మొత్తంలో ఉత్పత్తి అయ్యే ఇంగువలో 40 నుంచి 50 శాతం భారతదేశం మాత్రమే ఉపయోగిస్తుంది. అయితే భారతదేశంలో ఇంగువ సాగు చేయడం చాలా తక్కువ. ఈ పరిస్థితిలో డిమాండ్‌ను తీర్చడానికి విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. భారతదేశం ప్రతి సంవత్సరం 1200 టన్నుల ముడి ఇంగువను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు ఒక లెక్క. ఇందుకోసం ప్రభుత్వం రూ. 600 కోట్లు ఖర్చు చేస్తుంది. అందుకే రైతులు ఈ పంటని పండిస్తే ఎక్కువ ఆదాయం సంపాదించవచ్చు. ■



# కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా పాక్స్‌లు

- డాక్టర్ ఎస్ ఎల్ ఎన్ టి శ్రీనివాస్

దేశవ్యాప్తంగా ఎరువులను సరఫరా చేయని (రిటైలర్స్‌గా పని చేయని) 'ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను' (ప్రైమరీ అగ్రికల్చరల్ క్రెడిట్ సొసైటీలను... పాక్స్‌లను) దశల వారీగా గుర్తించి రిటైలర్లుగా పని చేసేలా ప్రోత్సహించాలని కేంద్రం నిర్ణయించింది. "సహకార్ సే సమృద్ధి" పథకం ద్వారా ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ దార్శనికతను సాకారంచేసే దిశలో తీసుకున్న ఐదు ముఖ్యమైన నిర్ణయాలలో ఇది ఒకటి. ఈ ముఖ్యమైన నిర్ణయాల వల్ల పాక్స్‌ల ఆదాయం పెరుగుతుంది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. రైతులు అధిక వ్యవసాయం, వ్యవసాయేతర ఉత్పత్తికి అవసరమగు ఎరువులను, పురుగు మందులను, విత్తనాలను, వ్యవసాయ యంత్రాలను స్థానికంగా పొందగలుగుతారు.

కేంద్ర హెూం, సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా ఢిల్లీలో రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవ్యతో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. పాక్స్‌లకు మేలుచేకూర్చే మరో ఐదు ముఖ్యమైన నిర్ణయాలను ప్రభుత్వం తీసుకుంది. పాక్స్ అనేది భారతదేశం లోని అతి చిన్న సహకార పరపతి సంస్థ.

దేశవ్యాప్తంగా దాదాపు లక్ష ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు ఉన్నాయి. మ్యాపింగ్ ఆధారంగా, ఎరువుల రిటైలర్‌లూ పనిచేయని పాక్స్‌లను గుర్తించి, సాధ్యాసాధ్యాల ఆధారంగా దశల వారీగా రిటైలర్‌లుగా పని చేసేలా ప్రోత్సహిస్తారు.

ప్రస్తుతం ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలు (పిఎంకెఎస్‌కె) గా పని చేయని (పిఎసిఎస్)ని పిఎంకెఎస్‌కె పరిధిలోకి తీసుకు వస్తారు. మూడవదశగా, పాక్స్‌లను సేంద్రియ ఎరువుల మార్కెటింగ్‌తో అనుసంధానిస్తారు. ముఖ్యంగా పులియబెట్టిన సేంద్రియ ఎరువు (ఎఫ్ఓఎం) లేదా పులియబెట్టిన ద్రవ రూప సేంద్రియ ఎరువు (ఎల్ఎఫ్ ఓఎం) లేదా ఫాస్ఫేట్ - సుసంపన్నమైన సేంద్రియ (పిఆర్ఓయం). ఎరువులను, పురుగు మందులను పిచికారీ చేయడానికి పాక్స్‌లు డ్రోన్ వ్యవస్థాపకులుగా కూడా వ్యవ హరించవచ్చు. ఆస్తి సర్వే కోసం డ్రోన్స్‌ను ఉపయోగిస్తారు.

చివరిగా, ఎరువుల శాఖ మార్కెట్ డెవలప్‌మెంట్ సహాయం (యండిఎ) పథకం కింద, చిన్న బయో ఆర్గానిక్ ఉత్పత్తిదారులకు తుది ఉత్పత్తిని మార్కెట్ చేయడానికి ఎరువుల సరిపోలికలు ఒక అగ్రిగేటర్‌గా పని చేస్తాయి. ఈ బయో-ఆర్గానిక్ ఎరువుల సరఫరా, మార్కెటింగ్ గొలుసులో పాక్స్ కూడా భాగస్వామ్యం పొందుతాయి. బయో-సేంద్రియ ఎరువుల సరఫరా, మార్కెటింగ్ గొలుసులో టోకు వ్యాపారులుగా, చిల్లర వ్యాపారులుగా కూడా పాక్స్‌కు స్థానం కల్పిస్తారు.

**కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన నిర్ణయాలు**

1. బహుళార్థక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఏర్పాటు
2. జాతీయ సహకార సమాచార వ్యవస్థ ఏర్పాటు
3. సహకార వ్యవస్థకు, సంఘాలకు ఆదాయ పన్ను రాయితీలు
4. ప్రపంచంలో అతి పెద్దదయిన ధాన్య భాండాగారం (సహకార రంగంలో) ఏర్పాటు
5. సహకార సంఘాల బలోపేతం - అవసరమగు మార్గదర్శక నియమనిబంధనలు
6. సహకార సంఘాలలో కంప్యూటరీకరణ
7. మూడు జాతీయ సహకార సమాఖ్యల ఏర్పాటు (విత్తనాలు - ఆర్గానిక్ - ఎగుమతి రంగాలలో)

**సహకారసంస్థల బలోపేతానికి గుర్తించిన పథకాలు**

1. వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి (ఎఐఎఫ్) ఏర్పాటు

2. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు మౌలిక సదుపాయాల కల్పన (ఏఎంఐ)
3. వ్యవసాయ యాంత్రీకరణ కోసం ఉప పథకం
4. తోట,ఉద్యానవనం సమగ్రాభివృది మిషన్
5. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ పథకం (పిఎంఎఫ్‌యంఇ)
6. ప్రధానమంత్రి మత్స్య సంపద పథకం
7. మత్స్య, ఆక్వా కల్చర్ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (ఎఫ్ఐడిఎఫ్)
8. జాతీయ పాడి అభివృద్ధి పథకం (ఎన్‌పిడిడి)
9. పాల ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాల అభివృద్ధినిధి
10. ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన (పిఎంకెఎస్‌వై)

**అమలు పర్యవేక్షణ**

1. **కేంద్ర స్థాయిలో :** కేంద్ర హెూం, సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా అధ్యక్షతన అంతర్గత మంత్రివర్గ కమిటి
2. **కేంద్ర స్థాయిలో :** కేంద్ర సహకారశాఖ కార్యదర్శి అధ్యక్షతన జాతీయ స్థాయి సమన్వయ కమిటి
3. **రాష్ట్ర స్థాయిలో :** సంబంధిత మంత్రులు / నాబార్డ్ / ఎన్‌సిడిసి ప్రతినిధులు సభ్యులుగా సమన్వయ కమిటిలు

**సహకార సంఘాల గణాంకాలు**

- మన దేశంలో 12 కోట్ల సభ్యులతో 1,01,285 పాక్స్‌లు వున్నాయి.
- 1.5 కోట్ల సభ్యులతో 1,38,347 డెయిరీ సంఘాలు
- 38 లక్షల సభ్యులతో 24,912 ఫిషరీస్ సంఘాలు
- 96405 గ్రామ పంచాయతీలలో పాక్స్‌లు, డైరీ సంఘాలు లేనట్లుగా గుర్తించారు
- 680 గ్రామ పంచాయితీలలో ఫిషరీ సంఘాలు లేనట్లుగా గుర్తించారు
- 27,954 గ్రామ పంచాయితీలలో పాక్స్ అసలే లేనట్లుగా గుర్తించారు
- 1,24,359 గ్రామ పంచాయితీలలో బహుళార్ధ ప్రయోజన సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని నాబార్డ్‌ను, ఎన్‌డిబిబి ని ఆదేశించారు
- పథకాల అమలుకు రూ. 1,67,127కోట్ల కేటాయింపు
- సహకార సంస్థల కంప్యూటరీకరణకు రూ. 2,516 కోట్ల బడ్జట్ ఆమోదం. ఈ పథకం ద్వారా 13 కోట్ల గ్రామీణ వ్యవసాయదారులకు మేలు జరుగుతుంది.
- సహకార రంగంలోని చక్కెర మిల్లుల పునర్ వ్యవస్థీకరణకు రు. 1,000 కోట్లు గ్రాంటుగా ఎన్‌సిడిసికి ఇవ్వడం జరిగినది.
- ఎన్‌సిడిసి ద్వారా ఋణం రూపంలో చెక్కర మిల్లులు ఎథనాల్ ప్లాంట్లు, కోజనరేషన్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చు.

**సంస్కరణల ద్వారా ఆశించే ఫలితాలు**

- నిర్వహణ సామర్థ్యం పెంపు
- జవాబుదారీతనం కలిగి ఉండటం
- పారదర్శకత ఉండాలి
- ఉపాధి అవకాశాలు పెంపు
- వ్యవసాయం ఉత్పతులు పెంచడం
- ఆహార భద్రత కల్పించడం
- మౌలిక సదుపాయములు కలిపించుట
- నాణ్యత కలిగిన శిక్షణ – విద్య
- కామన్ సర్వీస్ సెంటర్స్‌గా పని చేయడం
- పూర్తి యాంత్రీకరణ
- కంప్యుటరీకరణ (63,000 పిఎసిఎస్)
- స్వంత ఆర్థిక నిధులు పెంచుకొనడం గ్రామీణస్థాయిలో రైతులకి అన్ని రకాల సేవలు అందించుట

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన మోడల్ బైలాస్‌ను 19రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు అంగీకరించాయి.

(వ్యాస రచయిత హైదరాబాద్ ఐసిఎంలో సీనియర్ ఫ్యాకల్టీ మెంబర్)

■

# ఆంధ్రప్రదేశ్‌కు 4 జాతీయ జల అవార్డులు !

ఆంధ్రప్రదేశ్ నాలుగు జాతీయ జల అవార్డులను దక్కించుకుంది. దేశంలో జలసంరక్షణ, ఉత్తమ యాజమాన్య పద్ధతుల ద్వారా తక్కువ నీటితో అధిక ఆయకట్టుకు నీళ్ళు అందించడం తదితర విధానాలను ప్రోత్సహించడానికి 2019 నుంచి కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డులను ప్రదానం చేస్తోంది. తాజాగా 11 విభాగాల్లో 41 అవార్డులను ప్రకటించగా, ఆంధ్రప్రదేశ్ నాలుగు అవార్డులను దక్కించుకుంది.

- **జల సంరక్షణ, నిర్వహణలో ఆంధ్రప్రదేశ్‌కు మూడో స్థానం**
- **ఉత్తమ స్కూల్ విభాగంలో 2వ స్థానంలో నిలిచిన చాగలమర్రి కేజీబీవీ...**
- **పరిశ్రమల విభాగంలో తిరుపతిలోని సీసీఎల్‌కు 3వ స్థానం**
- **స్వచ్ఛంద సంస్థల విభాగంలో అనంతపురం జిల్లాకు చెందిన యాక్షన్ ఫ్రెటర్నాకు ప్రత్యేక అవార్డు**

నీటి వనరుల సంరక్షణ, నిర్వహణకుగాను ఉత్తమ రాష్ట్రాల విభాగంలో ఏపీ తృతీయ స్థానంలో నిలవగా, ఉత్తమ స్కూల్ విభాగంలో నంద్యాల జిల్లాలోని చాగలమర్రి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల (కేజీబీవీ) ద్వితీయ స్థానం, పరిశ్రమల విభాగంలో తిరుపతిలోని కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ తృతీయ స్థానం దక్కించుకున్నాయి.

స్వచ్ఛంద సంస్థల విభాగంలో అనంతపురం జిల్లాకు చెందిన యాక్షన్ ఫ్రెటర్నాకు ప్రత్యేక ప్రోత్సాహక అవార్డు లభించింది. అనంతపురం జిల్లాలో జల వనరుల అభివృద్ధి, మెట్ట వ్యవసాయంలో కరువు నుంచి రక్షించడానికి ఫారం పాండ్లు, రక్షక తడి, మిశ్రమ పంటలు, అంతర పంటలు మొదలైనవి విస్తృతంగా అమలు చేస్తూ విశేష కృషి చేసినందుకు యాక్షన్ ఫెటర్నాకు ఈ ప్రత్యేక అవార్డును ప్రకటించారు.

ఈ సందర్భంగా, ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి శ్రీ జగదీప్ ధనాడ్ నుంచి రాష్ట్ర జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ శశిభూషణకుమార్ జాతీయ జల అవార్డును అందుకున్నారు.

కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ నుంచి చాగలమర్రి కేజీబీవీ ప్రిన్సిపాల్, సీసీఎల్ ప్రతినిధులు, యాక్షన్ ఫ్రెటెర్నా డైరెక్టర్ శ్రీ మల్లారెడ్డి అవార్డులు అందుకున్నారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ మాట్లాడుతూ, నీటిని సంరక్షించుకోవడం ద్వారానే భవిష్యత్ తరాలను కాపాడుకోగలుగుతాం అన్నారు. జల సం రక్షణను రోజువారీ జీవితంలో అంత ర్భాగం చేసుకోవా లని సూచించారు. ప్రజా ప్రతినిధులు కూడా ఇందులో భాగ స్వాములు కావాలన్నారు.

– సాక్షి సౌజన్యంతో ■

## మనదేశ భూసారంలో కర్బన లోపం!

నీటిని పీల్చుకోవడంలో, సారవంతంగా ఉండటంలో కర్బనం మట్టికి చాలా సహాయపడుతుంది. దీన్ని సాయిల్ ఆర్గానిక్ కార్బన్ (ఎస్ఓసీ)గా వ్యవహరిస్తారు. అయితే.. భారత్‌లోని మట్టిలో ఎస్ఓసీ గడచిన 70 ఏళ్లలో 1శాతం నుంచి 0.3 శాతానికి పడిపోయిందని జాతీయ రెయిన్‌ఫెడ్ ఏరియా అథారిటీ (ఎన్ఆర్ఏఏ) సంస్థ సీఈఓ అశోక్ దాల్వాయ్ విలేకరుల సమావేశంలో తెలిపారు.

వ్యవసాయరంగంపై అధికంగా ఆధారపడిన భారత్‌కు ఇది చాలా ఆందోళనకర అంశమని ఆయన అభిప్రాయ పడ్డారు. ఇది చాలా రకాలుగా మట్టిపై ప్రభావాన్ని చూపిస్తుందని తెలిపారు. ఎస్ఓసీ లేని మట్టిలో.. మొక్కలకు మంచిచేసే సూక్ష్మక్రిములు అంతరించిపోతాయని దాల్వాయి వెల్లడించారు. రసాయన పురుగుల మందుల వాడకాన్ని రైతులు తగ్గించుకుని, సేంద్రీయ ఎరువులతో వ్యవసాయాన్ని చేయడమే దీనికి పరిష్కారమని సూచించారు. ■

# మదనపల్లి టమాటా రైతును ముంచుతున్న జాక్‌పాట్ !

**ఆ**సియాలోనే అతిపెద్ద టమాట మార్కెట్ యార్డ్‌గా మదనపల్లి గుర్తింపు పొందింది. మదనపల్లి మార్కెట్ యార్డుకు సీజన్ వున్నా, లేకపోయినా 300 టన్నుల నుండి 1700 టన్నుల వరకు అనేక ప్రాంతాల నుండి రైతులు టమాటాలను తీసుకొస్తారు. ఈ మార్కెట్ యార్డ్‌లో ప్రతిరోజు రైతులు తీసుకువచ్చే టమాటాలను వ్యాపారులు ఎప్పటికప్పుడు వేలం పాట ద్వారా కొనుగోలుచేసి బయట ప్రాంతాలకు తరలిస్తారు. ఇలా ప్రతిరోజు వేలంపాట జరుగుతుండడంతో నమ్మకం మీద రైతులు టమాటాలను తీసుకురావడం జరుగుతుంది. రైతుల నమ్మకాన్ని సొమ్ము చేసుకుంటున్న మండి వ్యాపారులు వారిని నుండి పెద్ద మొత్తంలో మోసగించేలా జేబులు నింపుకుంటున్నారు.

గత ఏడాది కాలంగా ధరలు లేక రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయారు. పంటకు పెట్టిన పెట్టుబడి సైతం కోల్పోయే పరిస్థితిని రైతులు ఎదుర్కొన్నారు. మామూలుగా ఎకరా నేలలో టమాటా వేయాలంటే మదనపల్లి ప్రాంతంలో రైతులు భారీగా ఖర్చు చేస్తారు. అధిక దిగుబడి కోసం టమాటా సాగుచేసే భూములను బాగా దుక్కులుచేసి , విత్తే ముందు పలు రకాల ఎరువులతో సారవంతం చేస్తారు. టమాటా మొక్కలను ఏపుగా పెరిగేందుకు కట్టెలు నాటి దారంతో పైకి పెంచుతారు. టమాట పంటకు రోగాలు సోకకుండా కొన్ని రకాల క్రిమిసంహారక మందులు వినియోగిస్తారు. ఇలా చేయడంవల్ల రైతులు భారీగా పెట్టుబడి భరించాల్సి ఉంది. భారీగా డబ్బులు ఖర్చుచేసి అతి కష్టం మీద మదనపల్లి టమాట మార్కెట్ యార్డ్‌కు రైతులు కాయలు తీసుకొస్తే వారిని ఇక్కడి వ్యాపారులు, దళారులు మోసగిస్తున్నారు.

రైతులు ట్రాక్టర్లు, లారీలు, ఆటోల ద్వారా టమాటాలను మార్కెట్‌కు తీసుకువస్తే ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు వేలంపాట కొనసాగుతుంది. వాహనాల ద్వారా తీసుకొచ్చే టమాటాలను క్రేటుకు రెండు రూపాయలు, 8 రూపాయలు గేటును మార్కెట్ యార్డ్ శాఖ అధికారులు, సిబ్బంది వసూలు చేయడం జరుగుతుంది. తర్వాత వేలం పాటలో రైతులను ముంచేలా వ్యాపారులు మోసానికి దిగుతున్నారు. 50 క్రేట్లు టమాటాలు తీసుకువచ్చే రైతుల నుండి. ఐదు క్రేట్లను తీసివేస్తారు. తర్వాత పది శాతం కమిషన్ వసూలు చేస్తారు. దీనివల్ల రైతులు భారీగా నష్టపోతున్నారు.

గేటు వసూలు, క్రేట్‌కు రెండు రూపాయలు తీసి వేయడం, కొన్ని క్రేట్లను పక్కకు తీసివేయడం, 10 శాతం కమిషన్ వల్ల రైతులు భారీగా నష్టపోతున్నాడు. ఇప్పుడున్న ధరల్లో లక్ష రూపాయలు వస్తే ఇవన్నీ పోను రైతులకు చేతికి అందేది 80000 మాత్రమే అని తెలుస్తుంది. ఇలా రైతులను మదనపల్లి మార్కెట్ యార్డ్ నిలువునా దోచుకుంటుంది. గతంలో జాక్ పాట్ విధానాన్ని 10 శాతం కమిషన్‌ను ఎత్తి వేయాలని రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు.

అప్పుడు స్పందించిన జిల్లా అధికారులు, ముఖ్య ప్రజా ప్రతినిధులు కమిషన్ 4 శాతం మాత్రమే తీసుకోవాలని, జాక్‌పాట్ విధానాన్ని ఎత్తివేయాలని ఆదేశించారు. మార్కెట్ యార్డ్ అధికారులు ఈ సవరణలను కొన్ని రోజులు పాటించిన ప్పటికి, తర్వాత పది శాతం కమిషన్ వసూలు, జాక్ పాట్ మళ్ళీ కొనసాగుతున్నది.

ఏడాదికాలంగా ధరలు లేక పూర్తిగా నష్టపోయిన రైతులు ఇప్పుడు ధరలు వుండీ నష్టపోవాల్సి వస్తున్నది. ఈ దోపిడీ వల్ల ఒక్క రోజుకు మార్కెట్ యార్డులో రైతులు రూ 10లక్షల నుండి రూ. 20 లక్షల వరకు నష్టపోతున్నారని అంచనా.

పొరుగున ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని కోలార్, శ్రీనివాస పురం, చింతామణి, వడ్డేపల్లి మార్కెట్ యార్డుల్లో ఈ అక్రమాలు లేవని అక్కడికి టమాటాలు తీసుకువెళ్లిన రైతులు చెబుతున్నారు. మదనపల్లి మార్కెట్ యార్డులో జరుగుతున్న జాక్‌పాట్, పదిశాతం కమిషన్ వసూలును అరికట్టాలని టమాటా రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

(అనుదిన వార్త సౌజన్యంతో)

■

# వానపాముల పెంపకంతో నెలకు అరలక్ష !

**వ్యా**పారంగా వానపాముల పెంపకాన్ని మొదట విదేశాల్లో ప్రారంభించారు. 1970 లలో వానపాములను ఐరోపా దేశాలలో, అమెరికాలో చేపలకు ఆహారంగా ఉపయోగించడం ప్రారంభించారు. దీని కారణంగా వానపాముల పెంపక వ్యాపారం అభివృద్ధి చెందింది. అయితే ఇప్పుడు మనదేశంలో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, వానపాముల ఎరువుకు ప్రాధాన్యం యిస్తున్నాయి. ఉదాహరణకు బీహార్‌లో ప్రభుత్వం ఆర్గానిక్ ఫార్మింగ్ కారిడార్‌ను రూపొందిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో వానపాములకు డిమాండ్ పెరుగు తోంది. వానపాముల పెంపకానికి ప్రభుత్వం నుంచి సబ్సిడీ కూడా లభిస్తోంది.



రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం వల్ల భూమిసారం క్రమేపీ తగ్గుతూవస్తోంది. భూమిలో పంటలు పండించే శక్తి బలహీనపడుతోంది. ముఖ్యంగా రసాయన ఎరువులను విచక్షణారహితంగా వాడడం వల్ల నేలలో సహజంగా ఉండే వానపాములు, ఇతర పోషకాల బాక్టీరియా అంతరించిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో దిగుబడి కూడా దెబ్బతింటోంది.

అయితే ఇప్పుడు రైతులు సహజమైన పద్ధతుల్లో పంటలను పండించే దిశగా మళ్ళీ అడుగులు వేస్తున్నారు. సహజమైన పేడ, కంపోస్ట్ ఎరువులతో పాటు ఇప్పుడు రైతులు వానపాములను కొనుగోలుచేసి తమ పొలాల్లో వేస్తున్నారు. ఇలా చేయడం వల్ల భూమి సహజంగానే పూర్వంలా సారవంతమై పంట దిగుబడి సామర్థ్యం పెరుగుతుంది. వానపాముల పెంపక వ్యాపారంతో రైతులు బాగానే సంపాదిస్తున్నారు.

వానపాములు భూసారాన్ని పెంచుతాయి. వాన పాములు పొలంలో పంటలకు సేంద్రియ ఎరువుగా పని చేస్తాయి. వానపాము భూమిలోపల పైకి క్రిందికి కదులుతూ ఉంటుంది. దీని కారణంగా మట్టిలో రంధ్రాలు ఏర్పడి, గాలి, వర్షపు నీరు భూమిలోపలికి చేరడానికి దోహదమవు తుంది. లేదా మట్టికి నీటిని లోపలికి ఇంకింప చేసుకునే శక్తి పెరుగుతుంది. అందుకే వానపాములను అన్నదాతల నేస్తం అని పిలుస్తారు.

**వానపాముల పెంపకం ఎలా**

వానపాముల పెంపకం ప్రారంభించాలనుకుంటే ముందుగా సూర్యరశ్మి తక్కువ ఉండి, నీడ ఉన్న స్థలాన్ని ఎంచుకోవాలి. ఆ స్థలంలో పెద్ద దీర్ఘచతురస్రాకార గొయ్యిని తవ్వాలి. ఆ గొయ్యిలో ఆవు పేడ, మట్టి, కుళ్లిన ఆకులు, కూరగాయలు, పండ్ల తొక్కలను వేసి కలపాలి.

తర్వాత ఆ గుంతలో ఎపిజిక్, అనిసిక్ జాతి వాన పాములను 50–60 వేసి గడ్డితో కప్పాలి. మధ్యమధ్యలో నీళ్లు చల్లుతుండాలి. మూడు నాలుగు వారాల తర్వాత వర్మీ కంపోస్టులో వాన పాముల సంఖ్య వెయ్యికి పైగా పెరగడం మీరు చూస్తారు. దీని తరువాత మీరు వీటిని మార్కెట్లో విక్రయించవచ్చు.

**50 వేలకు పైగా సంపాదన**

ప్రస్తుతం మార్కెట్‌లో 600 వానపాముల ధర 5వేల రూపాయలు. 2 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో వాన పాముల పెంపకం ప్రారంభిస్తే దాదాపు 8వేల వాన పాములను పొందవచ్చు. ఈ విధంగా 8 వేల వానపాములను విక్రయించి 50వేలకు పైగా సంపాదించవచ్చు. ■

వేధింపు మితిమీరితే ఎంత చిన్న ప్రాణి అయినా తిరగబడుతుంది

# శ్రీజ పాల ఉత్పత్తిదారులకు రూ. 9.48 కోట్ల బోనస్!

**పా**డి రంగంలో చిత్తూరు జిల్లా కేంద్రంగా నేడున్న పోటీ ప్రపంచంలో తనదైన కార్యాచరణతో అందరి ఆదరాభిమానాలను చూరగొంటూ, ప్రపంచంలోనే లక్ష మంది మహిళా సభ్యులు గల ఏకైక పాల ఉత్పత్తి సంస్థగా పేరు గాంచిన శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ త్వరలోనే సంస్థ టర్నోవర్ 1000 కోట్లు సాధించబోతుందని సంస్థ చైర్మన్ కుంటపల్లి శ్రీదేవి ప్రకటించారు. ప్రపంచ పాల దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్థకు పాలు అందించే సభ్యులలో పోటీ తత్వాన్ని పెంచడం, దానికి తగిన నగదు ప్రోత్సాహకాలను అందించడం ద్వారా మహిళా ఆర్థిక పురోగతిని సాధించడానికి వీలు అవుతుందన్నారు.

అందులో భాగంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో కనీసం 200 రోజులు లేక 500 లీటర్ల పాలను శ్రీజ సంస్థకు అందించిన సంస్థ సభ్యులకు నగదుగా రూ. 6,93,39,529, దృఢమైన స్టీల్ పాలకేన్ల రూపంలో రూ.2,547,7,500 మొత్తంగా 9.48 కోట్ల రూపాయలను బోనస్‌గా చెల్లిస్తామని చెప్పారు. ఈ బోనస్‌ను చెల్లించడానికి ఇటీవల జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆమోదం లభించిందని చైర్మన్ శ్రీదేవి 'ప్రజాశక్తి'కి తెలిపారు.

ప్రపంచ పాల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇంటర్నేషనల్ డైయిరీ ఫెడరేషన్ 2023 థీమ్‌గా పౌష్టికాహారం, జీవనోపాధిని అందిస్తూనే పాడి పరిశ్రమ పర్యావరణంపై దుష్ప్రభావాన్ని తగ్గించడంగా నిర్ణయించారని, ఈ నిర్ణయాన్ని శ్రీజ మహిళా పాడి ఉత్పత్తిదారుల సంస్థ కచ్చితత్వంతో పాటిస్తోందని, సంస్థ కార్యకలాపాలను ఆధునికరిస్తూనే పర్యావరణంపై ప్రభావాన్ని క్రమేపీ తగ్గించుకుంటూ పని చేస్తుందన్నారు.

అందులో భాగంగా నీటిని పొదుపుగా వినియోగించడం, సేంద్రియ పశు ఆహారం, సోలార్ విద్యుత్ ఉత్పత్తి కలిగిన ప్లాంట్లలో పాలు ప్రాసెస్ చేయడం వంటి ఎన్నో చర్యలను శ్రీజ సంస్థ పాటిస్తోందన్నారు.

సంస్థకు సంబంధించిన అన్ని లావాదేవీలను ఆన్‌లైన్ ద్వారానే జరుపుతూ నెలకు రెండుసార్లు తమ సభ్యుల బ్యాంకు ఖాతాలలో పాల బిల్లులను నేరుగా జమ చేస్తూ ఎక్కడా కరెన్సీ వాడకం లేకుండా ఆన్‌లైన్ పద్ధతి ద్వారానే కార్యకలాపాలను సాగిస్తోందన్నారు.

ఇంతటి ఘన విజయాలను సాధించడానికి సహకరిస్తున్న ఎస్టీడిబి, ఎన్టీడిబి డెయిరీ సర్వీసెస్, మదర్ డెయిరీకి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఆమె ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు.

('ప్రజాశక్తి' సౌజన్యంతో ...)

■



మంత్రి నిరంజన్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఎఫ్‌పీఓ సభ్యులు

## సమగ్ర వ్యవసాయ విధానం అవసరం

**యు**వత వ్యవసాయ రంగంలో రాణించాల్సిన అవసరం ఉందని వ్యవసాయశాఖ మంత్రి శ్రీ సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హ, గ్రామ పంచాయతీ శ్రీరామచంద్ర మిషన్లో సమున్నతి ఆధ్వర్యంలో రైతుల ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీఓ) అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి మంత్రి శ్రీ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, దేశంలో సమగ్ర వ్యవసాయ విధానం అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల ఉన్నతి కోసం సమీకృత వ్యవసాయం, పంట మార్పిడి, వైవిధ్యభరితమైన పంటలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ■

# 30 ఏళ్లు దాటిన మహిళల్లోనే ఎక్కువగా కిడ్నీ సమస్యలు

**ఓ** వయసు వచ్చాకా చాలామంది ఆడవారిలో కనిపిస్తున్న సమస్య కిడ్నీ సమస్య. ఇది మామూలుగా ఈమధ్య కాలంలో కనపిస్తున్నా, ముఖ్యంగా ఆడవారిలో 30 దాటాకా విరివిగా కనిపిస్తుంది. నిజానికి నెలసరి సమస్యతో, చికాకుతో బాధపడే ఆడవారికి కిడ్నీ సమస్య వచ్చిందంటే అది పెద్ద విషయంగా కనిపించదు. అసలు అటుగా ఆలోచన పోదు.

యూరిన్ ఇన్ఫెక్షన్ సమస్య వరకే తప్పితే కిడ్నీ గురించి, దానికి కలిగే వ్యాధుల గురించి మామూలు వారిలో పెద్దగా అవగాహన లేకపోవడం కూడా దీనికి ప్రధాన కారణం కావచ్చు. మామూలుగా 30 ఏళ్ళు వస్తున్నాయంటే అక్కడి నుంచే ఈ సమస్యకు దగ్గర అవుతున్నారని ముందు జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలి. ఈ వ్యాధి లక్షణాలు, కారకాలు ఏంటంటే..

**కిడ్నీలో రాళ్ళు..**

స్త్రీలలో కిడ్నీలో రాళ్ల సమస్య మూత్రపిండాలలో ఏర్పడే చిన్న, గట్టి నిక్షేపాలు. దీనికి ప్రధాన కారణం హార్మోన్లలో వచ్చే మార్పులు, ఆహారపు అలవాట్లు, జన్యుపరమైన అంశాలు కిడ్నీ స్టోన్ ఏర్పడటానికి కారణం అవుతాయి. వీపు లేదా పొత్తికడుపులో తీవ్రమైన నొప్పి, మూత్రంలో రక్తం, తరచుగా మూత్రవిసర్జన వంటి లక్షణాలు ఉండవచ్చు.

పుష్కలంగా నీరు త్రాగడం, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవడం, ఊబకాయం, మధుమేహం వంటి సమస్యలు మూత్రపిండాలలో రాళ్ళు వచ్చేందుకు కారణాలు అవుతాయి.

**యూరినరీ ఇన్ఫెక్షన్లు** (యుటిఐలు)

పురుషుల కంటే మహిళల్లో యుటిఐలు ఎక్కువగా కనిపిస్తాయి. చికిత్స చేయకుండా వదిలేస్తే అవి మూత్రపిండాలపై ప్రభావం చూపుతాయి. బ్యాక్టీరియా మూత్ర నాళంలోకి ప్రవేశించినప్పుడు యుటిఐలు సంభవిస్తాయి, ఇది సంక్రమణకు దారి తీస్తుంది. మూత్రవిసర్జన సమయంలో మంటగా అనిపించడం, తరచుగా మూత్రవిసర్జన, రక్తంతో కూడిన మూత్రం, కటి నొప్పి వంటి లక్షణాలు ఉండవచ్చు. కిడ్నీలకు ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెందకుండా ఉండడానికి యాంటీబయాటిక్స్‌తో కూడిన చికిత్స అవసరం.

**పాలిసిస్టిక్ కిడ్నీ డిసీజ్ (పికెడి)**

పికెడి అనేది కిడ్నీలలో అనేక తిత్తులు పెరగడం ద్వారా వచ్చే జన్యుపరమైన రుగ్మత. పికెడి పురుషులు, మహిళలు ఇద్దరినీ ప్రభావితం చేయవచ్చు, మహిళలు గర్భధారణ సమయంలో హార్మోన్ల మార్పులకు సంబంధించిన సమస్యలను ఎదుర్కొంటారు. కడుపు నొప్పి, అధిక రక్తపోటు, మూత్రంలో రక్తం తరచుగా మూత్ర మార్గము ఇన్ఫెక్షన్ వంటి లక్షణాలు ఉండవచ్చు.

**క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సికెడి)**

మధుమేహం, అధిక రక్తపోటు, స్వయం ప్రతిరక్షక వ్యాధులతో సహా వివిధ కారకాలు పికెడి కి దోహదం చేస్తాయి. 30 ఏళ్ల వయస్సులో ఉన్న స్త్రీలు హార్మోన్ల మార్పులు, కొన్ని ఆరోగ్య పరిస్థితుల కారణంగా ఎక్కువ ప్రమాదంలో ఉండవచ్చు.

**ప్రమాద కారకాలు ఏమిటి?**

**హైపర్ టెన్షన్ :** 30 ఏళ్లు పైబడిన మహిళల్లో మూత్రపిండాల వ్యాధికి అత్యంత సాధారణ ప్రమాద కారకాల్లో ఒకటి అధిక రక్తపోటు. అధిక రక్తపోటు మూత్రపిండాలను దెబ్బ తీస్తుంది. అవి సరిగ్గా పని చేయకుండా చేస్తాయి.

**మధుమేహం:** అధిక రక్తపోటుతో పాటు, మూత్రపిండాల వ్యాధికి మధుమేహం మరొక ప్రమాద కారకం. ఈ ప్రగతిశీల పరిస్థితి కిడ్నీలోని రక్తనాళాలను దెబ్బతీసి కిడ్నీ వ్యాధికి దారి తీస్తుంది.

**ఊబకాయం :** అధిక బరువు మూత్రపిండాలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. అవి దెబ్బతినడానికి కారణమవుతాయి.

■

ఎక్కడ సాగాలో తెలియడం కాదు, ఎక్కడ ఆగాలో తెలియాలి ; లేకుంటే ఇక్కట్లు తప్పవు

# వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి

- **బ్యాంకు ద్వారా ఫైనాన్సింగ్ సౌకర్యం**
- **3% వడ్డీ రాయితీ రూ.2 కోట్ల రుణము వరకు 7 సం.లకు రూ.2కోట్లు వరకు (జిటిఎంఎస్ఇ పథకం కింద క్రెడిట్ గ్యారెంటీ**
- **సబ్సిడీ పథకాలతో అనుసంధానం కలదు**
- **సబ్సిడీ పథకాలు : AMI, MIDH, PMFME, PMEGP, PMKSY, SMAM,PMKUSUM, RKVY, ACABC వంటి పథకాలతో కన్వర్జెన్స్ అర్హత కలిగియున్నది.**

**లబ్ధిదారులు:**

రైతులు వ్యక్తిగత మరియు ప్రైవేట్ సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, స్వయం సహాయక బృందాలు, స్టేట్ & నేషనల్ లెవల్ ఫెడరేషన్స్ / ఏజెన్సీలు

**ధరఖాస్తు ప్రక్రియ:**

1. ఆధార్, మొబైల్ నంబర్లో రిజిస్ట్రేషన్ (https://agriintra.dac.gov.in/Home/BeneficiaryRegistration)
2. దరఖాస్తు ఫారమ్ నింపండి. (టెంప్లేట్ మరియు పోర్టల్లో వివరణాత్మక నమూనా ప్రాజెక్టులు)
3. ప్రాధాన్య బ్యాంకు శాఖను ఎంచుకోండి మరియు దరఖాస్తును సమర్పించండి.
4. అప్లికేషన్ ధృవీకరణ
5. అప్లికేషన్ బ్యాంక్ లో ప్రాసెస్ చేయబడును.
6. వడ్డీ రాయితీ బ్యాంకు బదిలీ చేస్తుంది.

**అర్హత కలిగిన కార్యకలాపాలు**

1. గిడ్డంగులు/ పైలోస్ / కోల్డ్ స్టోరేజ్‌లు
2. ప్యాక్ హౌస్‌లు / రైపెనింగ్ గదులు
3. ప్రాథమిక ప్రాసెసింగ్ యూనిట్లు (రైస్, దాల్ మొదలైనవి)
4. శుభ్రం చేయటం/ఎండబెట్టడం / సోర్టింగ్ / గ్రేడింగ్
5. లాజిస్టిక్స్ సౌకర్యాలు - రీఫర్ వాన్ / ఇన్సులేటెడ్ వాహనాలు
6. ఇ-మార్కెటింగ్ సౌకర్యం / సరఫరా గొలుసు మౌలిక సదుపాయాలతో..
7. మౌలిక సదుపాయాలపై సౌర ప్యానెల్
8. వ్యవసాయ, వ్యర్థ పదార్థాల నిర్వహణ మౌలిక సదుపాయాలు
9. స్మార్ట్ మరియు ప్రెసిషన్ వ్యవసాయం.
10. ఇన్పుట్ ఉత్పత్తి (సీడ్ ప్రాసెసింగ్, కణజాల ఉత్పత్తి, నర్సరీ)
11. బయో-స్టిమ్యులెంట్ ఉత్పత్తి
12. వ్యవసాయ / పంటల ఆటోమేషన్
13. డ్రోన్లు రిమోట్ సెన్సింగ్
14. స్పిరులినా ఉత్పత్తికి ప్రాసెసింగ్ యూనిట్లు
15. పట్టు పరిశ్రమ ప్రాసెసింగ్ యూనిట్ / తేనె ప్రాసెసింగ్
16. కస్టమ్ నియామక కేంద్రం (వెచ్చని యంత్రాలు మెరుగుదలలు)
17. స్వతంత్ర సౌర పంపింగ్ వ్యవస్థ
18. హైడ్రోఫోనిక్ / పుట్టగొడుగు / వెర్టికల్ / ఏరోపోనిక్ వ్యవసాయం
19. పాలీహౌస్ / గ్రీన్ హౌస్

**తెలంగాణ స్టేట్ ఎఐఎఫ్ - పిఎంయు - టీమ్**

8045206865, 8346848300, 8247430581 email: wihalangana@gmail.com ■

# ఆర్బీకేల్లో 10 లక్షల టన్నుల ఎరువులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ ఖరీఫ్ సీజనుకు అవసరమైన ఎరువులు పుష్కలంగా ఉన్నాయని వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్.హరికిరణ్ చెప్పారు. ఈ సీజన్లో పంటలకు 15 లక్షల టన్నుల ఎరువులు అవసరమవుతాయని అంచనా వేశామని, ఇప్పటికే 10 లక్షల టన్నులను రైతుభరోసా కేంద్రాల్లో (ఆర్బీకేల్లో) అందుబాటులో ఉంచామని తెలిపారు.

వచ్చే ఏడాది రబీ సీజన్ పంటలకు కనీస మద్దతు ధరలు నిర్ణయించేందుకు జరిగిన దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సమావేశంలో పాల్గొనేందుకు విశాఖ వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఖరీఫ్ సీజన్ కోసం ఐదులక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం కాగా, ప్రస్తుతానికి నాలుగు లక్షల క్వింటాళ్లను సిద్ధం చేశామని చెప్పారు. కోస్తాంధ్రకు వరి, రాయలసీమకు వేరుశనగ విత్తనాలు ఎక్కువగా అవసరమవుతాయన్నారు.

ఈ ఏడాది ఎల్నినో ప్రభావం ఉండే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో అందుకు తగిన చర్యలు ఇప్పటినుంచే తీసుకుంటున్నామని తెలిపారు. ఎల్నినో ప్రభావం దక్షిణాది రాష్ట్రాలపై అంతగా ఉండకపోవచ్చని వాతావరణశాఖ అంచనా వేసిందని, అయినప్పటికీ ముందు జాగ్రత్త చర్యగా ఆగస్టు 15 వరకు రాష్ట్రంలో వర్షాలు కురవక పోతే ప్రత్యామ్నాయ పంటలపై అన్ని జిల్లాల సమాచారంతో సమగ్ర కంటింజెన్సీ ప్రణాళికను రూపొందించినట్టు చెప్పారు. రూ.25 కోట్ల నుంచి రూ.30 కోట్లు వెచ్చించి ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా ఉలవలు, చిరుధాన్యాలు, పప్పు దినుసులు, తృణ ధాన్యాలు తదితర మెట్టపంటల సాగుకు అనువైన విత్తనాలను సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

ఒకవేళ రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే ప్రస్తుతం యిస్తున్న 40 శాతానికి రెట్టింపు అంటే 80 శాతం సబ్సిడీపై రైతులకు ఈ విత్తనాలను పంపిణీ చేస్తామని చెప్పారు.

గతంలో తూర్పుగోదావరి జిల్లాలో వరదలు సంభవించినప్పుడు కంటింజెన్సీ ప్రణాళికను అమలు చేశామని ఆయన గుర్తు చేశారు. ■

# భర్త కోసం మొసలితో పోరాడి గెలిచిన మగువ !

చంబల్ నది తీరాన మొసలి నోటికి చిక్కిన భర్తను కాపాడుకునేందుకు వీరోచితంగా పోరాడిన ఓ మహిళ ఉదంతమిది. రాజస్థాన్ రాష్ట్రంలోని కరౌలీ జిల్లా మండరాయల్ సబ్ డివిజనులో ఇటీవల ఈ ఘటన జరిగింది. మేకలకు నీళ్లు తాగించేందుకు నది వద్దకు వెళ్లిన బనీసింగ్ మీనా (29) తనకూ దాహంగా ఉండటంతో రెండు దోసిళ్లతో నీరు తాగబోయాడు.

అంతే , నీటి మాటు నుంచి ఒక్క ఉదుటున బనీసింగ్ పై దాడి చేసిన మొసలి అతడి కాలిని నోట కరచి నీటి లోపలికి లాక్కొని పోయేందుకు ప్రయత్నించింది.

అనూహ్యమైన ఘటనతో బిత్తరపోయిన బనీసింగ్ గట్టిగా కేకలు వేశాడు. కాస్త దూరంలో ఉన్న విమలాబాయి భర్త కేకలు విని పరుగున వచ్చింది. అక్కడి పరిస్థితిని చూసి వెంటనే తేరుకొన్న ఆమె.. నదికి దగ్గరగా వెళ్లి చేతిలో ఉన్న కర్రతో మొసలి తలపై పదే పదే బాదింది. కాసేపటికి బనీసింగ్ కాలు వదిలేసి మొసలి నీటిలోకి వెళ్లిపోయింది. చుట్టుపక్కల గొర్రెలు మేపుతున్న వారు అక్కడికి చేరుకుని, తీవ్రంగా గాయపడిన బనీసింగ్‌ను జిల్లా ఆసుపత్రికి తరలించారు. తన భర్తను కాపాడుకోవడం ఒక్కటే లక్ష్యం కావడంతో భయం వేయలేదని విమల తెలిపింది. ■

అనుకున్నది నెరవేరనప్పుడు మరింత తపన,మరింత కృషి, చెదరని చిరునవ్వు మరింతగా అవసరం

# మాడు తెగులునుంచి పొద్దుతిరుగుడు సస్యరక్షణ !

పొద్దుతిరుగుడు నూనెకు మార్కెట్లో ఎక్కువ డిమాండ్ ఉంటుంది. దేశంలో పొద్దు తిరుగుడును అధిక విస్తీర్ణంలో పండించే రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ మూడవ స్థానంలో ఉంది. ఉత్పాదకతలో ఐదవ స్థానంలో ఉంది. ఈ పంట సాగు చేయడానికి నీరు నిల్వ ఉండని అన్ని నేలలు అనుకూలంగా ఉంటాయి. కాకపోతే రేగడి, ఒండ్రు నేలలలో అధిక దిగిబడి పొందవచ్చు. భూమి పీహెచ్ విలువ 6 నుండి 8 వరకు ఉండే నేలలు అనుకూలం అని చెప్పవచ్చు.



క్షార విలువలు అధికంగా ఉంటే అధిక దిగుబడి వస్తుంది. లోతట్టు ప్రాంతంలో ఉండే నేలలు, తేమ అధికంగా నిల్వ ఉండే నేలలు, సముద్రతీర ప్రాంతానికి దగ్గరిగా ఉండే నేలలు ఈ పొద్దు తిరుగుడు సాగుకు అనుకూలంగా ఉండవు.

ఇక ఈ పంట సాగు చేయడానికి ముందు భూమిని వేసవిలో లోతు దుక్కులు దున్ని మెత్తగా తయారు చేసుకోవాలి. ఇక నీటి వసతులు ఉంటే ఏడాదిలో ఏ కాలంలో అయినా ఈ పంటను పండించవచ్చు. కాకపోతే ఈ పంట పూతదశ, గింజలు తయారయ్యే దశలో అధిక వర్షపాతం, అధిక ఉష్ణోగ్రత 38 కంటే ఎక్కువగా ఉంటే దిగుబడి తగ్గే అవకాశం ఉంది. కాబట్టి ఈ విషయాలను గుర్తు పెట్టుకొని పంటను సాగు చేయాలి.

ఇక ఈ పంటకు తీవ్రనష్టం కలిగించే మాడు తెగులు ఎక్కువగా వర్షాకాలం, చలికాలంలో పంటను ఆశిస్తాయి. పంట వేసిన 50 రోజుల తర్వాత ఈ తెగులు పంటను ఆశించే అవకాశం ఉంది. పొద్దు తిరుగుడు ఆకులపై గోధుమ రంగులో లేదా నలుపు రంగులో గుండ్రని మచ్చలు ఏర్పడతాయి. ఈ మచ్చలు మొక్క మొత్తం వ్యాపించి గింజ యొక్క నాణ్యత తగ్గిపోయేలా చేస్తాయి.

ఈ తెగుల నివారణకు లీటరు నీటిలో కాపర్ ఆక్సిక్లోరైడ్ మూడు గ్రాములు కలిపి పిచికారి చేయాలి. లేదంటే రెండు గ్రాముల మెటాలాక్సిన్ ఎం.జడ్‌ను నీటిలో కలిపి పిచికారి చేసి ఈ తెగుల నుండి పంటను సంరక్షించుకుంటే అధిక దిగుబడి పొందవచ్చు. ■



# రోజుకు రూ.95 పెట్టుబడి రూ.14 లక్షల రాబడి !

మనకు అంతగా తెలియకపోవచ్చు గానీ పోస్టాఫీసులో చాలా పథకాలు ఉంటాయి. వాటిలో కొన్ని మన జీవతానికి భద్రత ఇస్తాయి. అలాంటి ఓ చక్కని స్కీమ్ గురించి తెలుసుకుందాం

ఈ స్కీమ్ పేరు 'గ్రామ సుమంగళ్ రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ స్కీమ్'. పేరు చాలా పెద్దగా ఉంది కదూ! దీని ఆశయం కూడా పెద్దదే. ఇదో ఎండోమెంట్ స్కీమ్. దీనివల్ల చెల్లించిన ప్రీమియం డబ్బులు వెనక్కి ఇవ్వడమే కాదు ఇన్సూరెన్స్ కవరేజ్ కూడా లభిస్తుంది. కాకపోతే, ఇది గ్రామాల్లోని వారికే. ఇందులో 2 రకాల ప్లాన్లు ఉన్నాయి. మీరు రోజూ రూ.95 చొప్పున పెట్టుబడి పెడితే... స్కీమ్ గడువు ముగిసే నాటికి మీకు రూ.14 లక్షలు తిరిగి ఇస్తారు. రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ స్కీమును 1995లో ప్రారంభించారు. దీనికింద 6 రకాల ఇన్సూరెన్సు స్కీములు ఉన్నాయి. వాటిలో ఒకటి గ్రామ సుమంగళ్ రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ స్కీమ్.

ఈ స్కీమ్ కింద సదరు వ్యక్తి చనిపోతే కుటుంబ సభ్యులకు రూ.10 లక్షలు ఇస్తారు. స్కీమ్ ముగిసేనాటికి బతికి ఉంటే , రూ.14 లక్షల దాకా పొందవచ్చు. ఈ స్కీమ్‌లో 15 ఏళ్ల ప్లాన్, 20 ఏళ్ల ప్లాన్ ఉన్నాయి. ఈ పాలసీ తీసుకునేవారి కనీస వయస్సు 19 సంవత్సరాలు ఉండాలి. 15 ఏళ్ల ప్లాన్ ఎంచుకునేవారు తమకు 45 ఏళ్లు వచ్చేవరకూ ప్లాన్ పెంచుకోవచ్చు. అలాగే, 20 ఏళ్ల ప్లాన్ ఎంచుకునేవారు రూ.40 ఏళ్లు వచ్చే వరకు ప్లాన్ పెంచుకోవచ్చు

15 ఏళ్ల ప్లాన్ తీసుకునేవారికి 6 ఏళ్ల తర్వాత 20 శాతం డబ్బు వెనక్కి ఇస్తారు. 9 ఏళ్ల తర్వాత మరో 20 శాతం, 12 ఏళ్ల తర్వాత మరో 20 శాతం వెనక్కి ఇస్తారు. మిగతా 40 శాతం, బోనస్ కలిపి పాలసీ గడువు తీరాక ఇస్తారు. ఇదే విధంగా 20 ఏళ్ల పాలసీ తీసుకున్నవారికి 8 ఏళ్లు, 12 ఏళ్లు, 16 ఏళ్లకు 20 శాతం చొప్పున మనీ బ్యాక్ ఇస్తారు. మిగతా 40 శాతం, బోనస్ కలిపి గడువు తీరాక ఇస్తారు.

25 ఏళ్ల వ్యక్తి 20 ఏళ్లకు పాలసీ తీసుకుంటే మొత్తం రూ.7 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అంటే నెలకు రూ.2,853 అంటే రోజుకు రూ.95. మూడునెలలకోసారి ప్రీమియం చెల్లించాలంటే రూ.8,449 చెల్లించాలి. 6 నెలల కైతే రూ.16,715, సంవత్సరానికి ప్రీమియం రూ.32,735 అవుతుంది. పాలసీ గడువు ముగిసేనాటికి మొత్తం చెల్లించాల్సింది రూ.13.72 లక్షలు అవుతుంది. అందులో పర్సెంటేజీల ప్రకారం... వివిధ గడువుల్లో చెల్లించింది పోగా మిగిలినది గడువు ముగిశాక చెల్లిస్తారు. ■


## డెయిరీ ఫాంలో భారీపేలుడు: 18 వేల ఆవులు సజీవ దహనం

అమెరికాలో ఘోర ప్రమాదం సంభవించింది పశ్చిమ టెక్సాస్‌లో ఓ డెయిరీ ఫాంలో భారీ పేలుడు సంభ వించడంతో ఏకంగా 18 వేల ఆవులు మృతి చెందాయి. 10.04.2023న డిమిట్‌లోని సౌత్ ఫోర్క్ ఫాంలో ఈ ప్రమాదం జరిగింది. పేలుడు ధాటికి డెయిరీ ఫాంపై గంట పాటు దట్టమైన పొగ కమ్ముకున్నట్టు స్థానికులు తెలిపారు.

డెయిరీ ఫాంలో ఈ ప్రమాదం ఎలా సంభవించిందో స్పష్టత లేదు. అయితే పరికరం పని చేయకపోవడం వల్లే ఇది జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆవుల నుంచి పాలు పితికే సమయంలో ఈ ఘటన సంభవించింది పెను నష్టాన్ని కలుగజేసింది. అగ్ని ప్రమాదంలో వేల ఆవులు మృతి చెందినట్టు అధికారులు తెలిపారు. డెయిరీ ఫాంలోని మొత్తం ఆవుల్లో 90 శాతం మరణించాయని చెబుతున్నారు. అమెరికాలో ప్రతిరోజూ కబేళాల్లో వధిస్తున్న ఆవుల సంఖ్య కంటే ఇది అధికమని తెలుస్తోంది. ■

కోపమెందుకు? నీవు చెప్పేది సరైనదైతే కోపంతో పనిలేదు, సరైనది కాకుంటే కోపించే అర్హత లేదు

# ఎన్నో వ్యాధులనుంచి కాపాడే ఎర్రబియ్యం!



**రెడ్** రైస్.. గురించి చాలామంది వినను కూడా విని ఉండరు . ఈ బియ్యం పొడవుగా ఉంటాయి. ఆంథోసైనిన్ అనే వర్ణద్రవ్యం వల్ల ఎర్రటి రంగును కలిగి ఉంటాయి. ఈ రెడ్ రైస్ పాలిష్ చేసిన బియ్యం కంటే కూడా అధిక పోషక విలువను కలిగి ఉంటాయి. రెడ్ రైస్‌ను సాధారణంగా ఆసియా దేశాలలో.. ముఖ్యంగా భారతదేశం, శ్రీలంక, ఇండోనేషియాలో పండిస్తూ ఉంటారు. బియ్యం దాని బయటి పొర నుంచి ఎరుపు రంగును పొందుతుంది. దీనికి ఊక అని పిలుస్తారు. మరి ఈ రెడ్ రైస్‌ను ఎందుకు తినాలి? దీని వల్ల ఉపయోగాలేంటి? అనేవి చూద్దాం.

**1. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి**

రెడ్ రైస్‌లో ఆంథోసైనిన్‌ల వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవే బియ్యం ఎరుపు రంగు రావడానికి కారణం. ఈ యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరించడంలో సహాయపడతాయి. తద్వారా క్యాన్సర్, గుండె జబ్బులు, మధుమేహం వంటి వివిధ వ్యాధులకు దారితీసే కణాల నష్టాన్ని నిరోధించడం కానీ లేదంటే లేదా నెమ్మదిస్తుంది.

**2. ఫైబర్ పుష్కలం**

ఎర్ర బియ్యంలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. కొవ్వు తక్కువగా ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి బాగా ఉపయోగపడుతుంది. జీర్ణక్రియ ప్రక్రియలో ఫైబర్ చాలా అవసరం. పేగు కదలికలను మెరుగుపరచడానికి, మలబద్ధకాన్ని నివారించడానికి, శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు షుగర్ పెరగకుండా చేస్తాయి. ఇది టైప్ 2 డయాబెటిస్‌ను అభివృద్ధి చేసే ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**3. విటమిన్లు, ఖనిజాలు పుష్కలం..**

రెడ్ రైస్‌లో పుష్కలంగా విటమిన్లు, ఖనిజాలుంటాయి. ముఖ్యంగా విటమిన్ బి6 కావల్సినంత లభిస్తుంది. ఇది శరీరానికి మానసిక స్థితిని నియంత్రించే రెడ్ బ్లడ్ సెల్స్, న్యూరో ట్రాన్స్‌మిటర్‌లను ఉత్పత్తి చేయడంలో సహాయపడు తుంది. రెడ్ రైస్‌లో ఉండే విటమిన్ ఇ, ఆరోగ్యకరమైన చర్మాన్ని నిర్వహించడానికి సహాయపడే యాంటీఆక్సిడెంట్, కొన్ని క్యాన్సర్‌ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అదనంగా, ఎర్ర బియ్యంలో పొటాషియం, ఐరన్,మెగ్నీషియం ఉన్నాయి. ఇవి రక్తపోటు, జీవక్రియను నిర్వహించడానికి సహాయపడతాయి.

**4. గ్లూటెన్ ఫ్రీ..**

రెడ్ రైస్ సహజంగా గ్లూటెన్ రహితంగా ఉంటుంది. ఉదరకుహర వ్యాధి, గ్లూటెన్ అసహనం లేదా వీట్ అలెర్జీ ఉన్నవారికి ఇది అద్భుతమైన ఆప్షన్. గ్లూటెన్ తినడం వల్ల ఈ పరిస్థితులు ఉన్నవారికి తీవ్రమైన కడుపు నొప్పి, అతిసారం, ఇతర జీర్ణ సమస్యలు వస్తాయి. అందువల్ల ఎర్ర బియ్యాన్ని వారి ఆహారంలో చేర్చడం వల్ల గోధుమ, రైస్, బార్లీ వంటి గ్లూటెన్ అధికంగా ఉండే ధాన్యాలకు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా మారుతుంది.

**5. క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది..**

రెడ్ రైస్ పెద్దప్రేగు క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్ వంటి కొన్ని క్యాన్సర్‌ల ప్రమాదాన్ని తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. బియ్యంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ సమ్మేళనాలు క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ■

# మహిళలూ... ఈ ఆరు లక్షణాలతో జాగ్రత్త !

**గుం**డె జబ్బుతో బాధపడుతున్న స్త్రీలను గుర్తించడంలో ప్రధాన సమస్య ఏమిటంటే, ఈ వ్యాధికి సంబంధించిన లక్షణాలు వారిలో గుర్తించలేకపోవడం. పురుషులకు భిన్నంగా, స్త్రీలలో సూక్ష్మంగా, గుండెపోటును గుర్తించడం జరుగుతుంది. ఇంకో విషయం ఏంటంటే వైద్యులు కూడా సాధారణ గుండె సమస్యలపైనే వాటి లక్షణాలపైనే దృష్టి పెట్టడం కూడా ఓ కారణం కావచ్చు.

గుండెపోటు వచ్చినప్పుడు, మగవారిలో కనిపించే లక్షణాలు స్త్రీలకు ఉండవు. మహిళల్లో గుండెపోటు లక్షణాలు ఎలా భిన్నంగా ఉంటాయో తెలుసుకుందాం.

ఛాతీ నొప్పి అనేది గుండెపోటులో అత్యంత సాధారణ లక్షణం, కానీ కొంతమంది మహిళల్లో యిందుకు భిన్నంగా ఉంటుంది. గుండె బిగుతుగా లేదా నొక్కినట్లుగా అనిపించ వచ్చు. ఇది ఎడమవైపు మాత్రమే కాకుండా ఛాతీలో ఎక్కడైనా వచ్చే అవకాశంఉంది. చేయినొప్పి, వెన్నునొప్పి, మెడనొప్పి లేదా దవడనొప్పి వంటి లక్షణాలు పురుషుల కంటే మహిళ ల్లోనే ఎక్కువగా కనిపిస్తాయి. వెన్ను నొప్పి లేదా దవడ నొప్పి కంటే ఛాతీలో, ఎడమ చేతిలో నొప్పి వస్తే, స్త్రీలను గందరగోళానికి గురిచేస్తుంది. గుండెల్లో మంట, ఫ్లూ లేదా కడుపు పూతలతో గుండె పోటు రావడాన్ని సూచించే కడుపు నొప్పి తరచుగా కంగారుపెడుతుంది. కొందరు మహిళలకు పొట్ట బాగా ఒత్తుకుంటున్నట్టు అనిపిస్తుంది. ఇది గుండెపోటుకు సంకేతం కావచ్చు.

నిర్దిష్టమైన కారణం లేకుండా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలగడం, ఎక్కువగా చలివేయడం, వ్యాయామంతో లేదా శారీరక శ్రమతో నిమిత్తం లేకుండా ఎక్కువగా చెమట పట్టడం కూడా ఈ లక్షణాలుగా భావించవచ్చు. గుండెపోటు వచ్చిన స్త్రీలు కదలకుండా వున్నచోటనే వున్నా కూడా విపరీతమైన అలసటగా అనిపించడం సాధారణం.

మెనోపాజ్‌కు ముందు, మెనోపాజ్ సమయంలో టెస్టోస్టెరాన్ స్థాయిలు ఎక్కువగా ఉంటాయి, రక్తపోటు పెరుగుతుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి వ్యాధుల ప్రాబల్యం పురుషుల కంటే మహిళల్లో ఎక్కువగా వుంటుంది. మానసిక ఒత్తిడి, డిప్రెషన్ కూడా మహిళల్లో ఎక్కువే.

గుండె జబ్బులకు ప్రమాదకారకాలపై తగిన అవగాహన లేకపోవడం కూడా ప్రమాదకరమే. గుండెపోటుకు ఈ అన్ని లక్షణాలు వుండాలని కూడా లేదు. అయితే, ఛాతీలో యిబ్బందిగా వుంటే, ముఖ్యంగా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ లక్షణాలు కనిపిస్తే మాత్రం వెంటనే వైద్యుడిని కలవడం మంచిది. ■

## మహిళ పేరు మీదే 'గృహలక్ష్మి' ఇల్లు

**తె**లంగాణ ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు జీవోఎంఎస్ 25ని జారీ చేసింది. మహిళల పేరు మీద ఇల్లు మంజూరు చేయనుంది. లబ్ధిదారులు తమకు ఇష్టమైన డిజైన్ ఎంపిక చేసుకోవచ్చు. దరఖాస్తులను జిల్లా కలెక్టర్లు స్వీకరిస్తారు. సంబంధిత కుటుంబం ఫుడ్ సెక్యూరిటీ కార్డును కలిగి ఉండాలి.

జిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో, జీహెచ్ఎంసీలో కమిషనర్ ఆధ్వర్యంలో పథకం అమలు చేస్తారు. రెండు గదులతో ఆర్సీసీ ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం ప్రభుత్వం అందించనున్నట్లు పేర్కొంది. సొంత జాగా ఉండి ఇంటి నిర్మాణం కోసం అర్హులైన లబ్ధిదారులకు రూ.3 లక్షల ఆర్థికసాయం ప్రభుత్వం అందిస్తుంది. ప్రతి నియోజకవర్గంలో 3 వేల ఇళ్లు ఇస్తారు. దీంతో మొత్తం 4 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుంది. వీటికి రూ.7,350 కోట్లు ఖర్చు చేయనుంది.

గృహలక్ష్మి పథకం కోసం ప్రత్యేక వెబ్ పోర్టల్‌తో పాటు, మొబైల్ యాప్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తుంది. ■

# వాతావరణ మార్పుల ప్రభావం

## వ్యవసాయంపై ...

వాతావరణ మార్పులు - వ్యవసాయం కరువు కాటకాల పాలు
పెరిగే ఎండలతో కరువు కాటకాలు - అధికమైన చీడపీడలు
భూమి గట్టిపడటం - భూసారం తగ్గిపోవడం
అడుగంటిన భూగర్భ జలాలు - ఆవిరవుతున్న నీటి వనరులు

భూమిలో తేమ లేదు - వేసిన విత్తు మొలవదు
అకాల వర్షాలు - నీరంతా సముద్రం పాలు
భూమిలోకి నీరు ఇంకదు - పంటకు నీరు అందదు

చేతికి రాని పంటలు - తగ్గిపోతున్న పంట దిగుబడులు
మేత, నీరు అందని జీవాలు - తగ్గిపోతున్న పశు సంపద
ఉపాధిలేని కుటుంబాలు - పెరుగుతున్న వలసలు
అప్పుల భారంతో వ్యవసాయం నష్టాల పాలు-
కృంగిపోతున్న రైతన్న జీవితాలు
అయినా... వానకోసం రైతన్న పడిగాపులు





## జీవనోపాధులపై....




ఆహార
భద్రతకు ముప్పు



పోషకాహార
లోపాలు




తగ్గే ఉపాధి
అవకాశాలు



రోగాలతో
పెరుగుతున్న ఖర్చులు



పంట నష్టాలతో
పెరిగే అప్పులు



పెరిగే వలసలు

MAHILA SADHIKARATHA
Publication Date: 01-07-2023 ; Posting Date: 05 & 06-07-2023

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23

## ఆంధ్రప్రదేశ్‌కు 4 జాతీయ అవార్డులు ... మరికొన్ని దృశ్యాలు





పురస్కార గ్రహీతలు : జలవనరులశాఖ అధికారులు ... కె జి బి వి ప్రిన్సిపాల్ ... సి సి ఎల్ ప్రతినిధి





బీహార్‌లో రెండు ఎఫ్ పి సిల డైరెక్టర్లకు, ప్రోత్సాహక సంస్థల ప్రతినిధులకు ఏపిమాస్ శిక్షణ దృశ్యాలు






ఆప్కాబ్ డి సి సి బి – సి ఇ ఓల సమావేశంలో శ్రీ సి ఎస్ రెడ్డి ... ఏ ఎం మాక్ట్స్ వార్షిక సర్వసభ్య సమావేశం

## చిరుధాన్యాలపై అవగాహన సమావేశాల సంరంభం !





ఏపిమాస్ స్టాల్‌ను తిలకిస్తున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీ గిరిషా ... గుడిబండలో ... కురబలకోటలో ...

To ADDRESS



వాల్మీకిపురంలో పర్యావరణ దినోత్సవం

బట్వాడా కాకపోతే దయచేసి ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089